శుక్రవారం
FRIDAY
6-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 128

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక



నందిని పనీర్ ధరలు పెంపు



బెంగళూరు, నవంబర్ 5 (ఈవార్తలు): కర్ణాటకకు చెందిన ప్రముఖ నందిని డెయిరీ బ్రాండ్ వినియోగదారులపై వారంలోనే రెండోసారి ధరల భారం మోపింది. పాలు, పెరుగు ధరలను పెంచిన సరిగ్గా వారం రోజులకే, బెంగళూరు మిల్క్ యూనియన్ నెయ్యి, వెన్న, పనీర్ ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. -2 వ పేజీలో...



పచ్చిగుడ్ల మయోనైజ్‌పై మరో ఏడాది నిషేధం

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): తెలంగాణలో పచ్చిగుడ్లను ఉపయోగించి తయారు చేసే మయోనైజ్ తయారీ, నిల్వ, విక్రయా లపై ప్రభుత్వం మరో ఏడాది పాటు నిషేధాన్ని పొడిగించింది. అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఆహార భద్రతా ప్రమాణాల శాఖ తాజాగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని - 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,602
వెండి (కిలో):	రూ.2,10,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,239



కాళేశ్వరం కథ అసెంబ్లీకి!

ప్రత్యేక సెషన్ నిర్వహణకు కేబినెట్ నిర్ణయం.. నెలాఖరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు!

బరాజ్‌ల పునరుద్ధరణపై సీఎం సమీక్ష.. రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు



కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెలాఖరులో రెండు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి, మరమ్మతుల పురోగతి, గోదావరి జలాల వినియోగంపై సభలో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను తిరిగి సురక్షితంగా వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పునరుద్ధరణ పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. గతంలో జరిగిన నిర్మాణ సంబంధిత తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థలు, నిపుణుల సలహాలు తీసుకున్న తర్వాతే పనులు ప్రారంభించాలని చెప్పారు. మేడిగడ్డ వద్ద నీరు కనిపిస్తున్నప్పటికీ

వ్యవసాయ శాఖ సర్వర్లు భద్రమేనా

తెలంగాణ వ్యవసాయ శాఖలో రైతుల వ్యక్తిగత సమాచారం భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాల అమలు కోసం శాఖ ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతాలు, భూమి రికార్డులు, మొబైల్ నంబర్లు, ఫొటోలు వంటి కీలక సమాచారాన్ని డిజిటల్ రూపంలో సేకరిస్తోంది. లక్షలాది మంది రైతులకు సంబంధించిన ఈ సమాచారం భద్రపరిచే సర్వర్లు ఎంతవరకు సురక్షితం? డేటా రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల సుమారు 2.73 లక్షల మంది రైతులకు రైతు భరోసా నిధులు విడుదలైనట్లు ముఖ్యమంత్రి పేరుతో తప్పుడు సందేశాలు వెళ్లినట్లు వార్తలు వెలువడటం కలకలం రేపింది. ఈ సందేశాలను తాము పంపలేదని వ్యవసాయ శాఖ స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో సందేశాల మూలం ఏమిటి? రైతుల మొబైల్ నంబర్లను ఎవరు వినియోగించారు? ప్రభుత్వ సమాచార వ్యవస్థ దుర్వినియోగానికి గురైందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైతుల డేటాకు రక్షణ ఏది?.. బాధ్యత వహించేది ఎవరు?

2.73 లక్షల మంది రైతులకు సందేశాలు ఎలా?

ఏపీకే యాప్‌ల భద్రతపైనా అనుమానాలు

సైబర్ సెక్యూరిటీ ఆడిట్ ఎప్పుడు?

(ఈవార్తలు - స్పెషల్ స్టోరీ)

వ్యవసాయ శాఖ వద్ద ఉన్న ఆధార్ అనుసంధాన వివరాలు, బ్యాంకు ఖాతాలు, భూమి విస్తీర్ణం, ఫోన్ నంబర్లు వంటి సమాచారం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళితే రైతులు ఆర్థిక మోసాలు, గుర్తింపు దుర్వినియోగం వంటి సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతుల సమాచారం ఏ సర్వర్లలో నిల్వ చేస్తున్నారు? వాటి నిర్వహణ బాధ్యత ఎవరిది? ఎంతమందికి డేటా యాక్సెస్ ఉంది? అనే అంశాలపై శాఖ స్పష్టత ఇవ్వాల్సి ఉంది. సమాచారాన్ని ఎన్‌క్రిప్షన్‌తో భద్రపరచడం, అనుమతి ఉన్నవారికే యాక్సెస్ కల్పించడం, ప్రతి డేటా వినియోగాన్ని తరువాయి 2 వ పేజీలో...



కాంగ్రెస్ నుంచి 200 మంది సస్పెండ్

తెలంగాణ నుంచి 15 మందిపై వేటు

రాహుల్ ర్యాలీకి రాలేదని క్రమశిక్షణ చర్యలు

యూత్ కాంగ్రెస్ కలిన నిర్ణయాలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ చర్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న రాహుల్ గాంధీ పాల్గొన్న ఇండియా కూటమి ర్యాలీకి హాజరుకాని వారిపై యూత్ కాంగ్రెస్ నాయకత్వం కఠినంగా వ్యవహరించింది. దేశవ్యాప్తంగా సుమారు 200 మంది యూత్ కాంగ్రెస్ సభ్యులను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ర్యాలీకి హాజరుకాని వారిపై చేపట్టిన చర్యల్లో భాగంగా మధ్యప్రదేశ్‌లో 60 మంది, గుజరాత్‌లో 49, పశ్చిమ బెంగాల్‌లో 26, తెలంగాణలో 14, ఉత్తరప్రదేశ్, హిమాచల్ తరువాయి 2 వ పేజీలో...



బీసీ భవనాలకు 88.5 కోట్లు

38 భవనాల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు

ఏడాదిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను తరువాయి 2 వ పేజీలో...



సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సివిల్ సర్వీసెస్ (మెయిన్) ఎగ్జామినేషన్ 2026 ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) గురువారం ప్రకటించింది. ఈ ఫలితాల్లో మొత్తం 2,526 మంది అభ్యర్థులు తదుపరి దశ అయిన పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించినట్లు యూపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు 21, 22, 23, తరువాయి 2 వ పేజీలో...

విశ్వవాణి



మానవ కణాల్లో వృద్ధాప్య లక్షణాలను కేవలం రసాయన సమ్మేళనాలతోనే తగ్గించే మార్గాన్ని హార్వర్డ్ వైద్య కళాశాల పరిశోధకులు గుర్తించారు. డేవిడ్ సింక్లెయిర్ నేతృత్వంలోని బృందం ఆరు రకాల రసాయన సమ్మేళనాల మిశ్రమాలను అభివృద్ధి చేసింది. వీటితో వృద్ధాప్యానికి గురైన మానవ కణాల్లో జన్యువుల క్రియాశీలతకు సంబంధించిన నమూనాలు తిరిగి యవ్వన దశలో ఉన్న కణాల మాదిరిగా మారినట్లు పరిశోధకులు గుర్తించారు. కణ కేంద్రకం, మిగతా కణ భాగాల మధ్య జన్యు సమాచార రవాణాలో వయసుతో వచ్చే మార్పులు కూడా మెరుగుపడ్డాయని వెల్లడించారు.



ఒకే వేదికపై జగన్, విజయ్, కేటీఆర్

వైఎస్ జగన్ బంధువు వైఎస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహం ఉజ్వల్‌తో చెన్నైలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జగన్, తమిళనాడు సీఎం విజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకే వేదికపై కనిపించడం గమనార్హం. ముగ్గురు కీలక నేతలు ఒకే వేదికపై కనిపించడం అక్కడున్న వారిని ఆకర్షించింది. జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన తనయుడు ఎంపీ మిథున్ రెడ్డి తదితరులు ఈ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



అరెస్టు చేసినప్పటి నుంచే

24 గంటల లెక్క

పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన

అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలన్న రాజ్యాంగ నిబంధనపై సుప్రీంకోర్టు కీలక వివరణ ఇచ్చింది. పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి కాకుండా.. వాస్తవంగా నిర్బంధించిన క్షణం నుంచే లెక్కించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించి అదుపులోకి తీసుకున్న సమయమే ఈ గడువుకు ప్రాతిపదిక అని తేల్చిచెప్పింది.

న్యూడిల్లీ: త్రిపురలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నలుగురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని ప్రయాణానికి తరువాయి 2 వ పేజీలో...



బ్యాంకింగ్ భూకంపం

పరాగ్వేలో కుప్పకూలిన యుయెనో బ్యాంక్.. 30 లక్షల ఖాతాలు స్తంభన

ప్రభుత్వ నిధులు, పెన్షన్ సొమ్ముపై ప్రభావం.. సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ రాజీనామా

అధ్యక్షుడు శాంటియాగో పెన్యా రాజీనామా ప్రకటన.. అభిశంసనకు అనుకూలంగా దిగువ సభ ఓటు

దక్షిణ అమెరికా దేశమైన పరాగ్వేలో భారీ బ్యాంకింగ్ సంక్షోభం రాజకీయ ప్రకంపనలకు దారితీసింది. దేశంలోని ప్రముఖ డిజిటల్ బ్యాంకింగ్ సంస్థ యుయెనో బ్యాంకు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడంతో లక్షలాది మంది ఖాతాదారుల సొమ్ము స్తంభించిపోయింది. బ్యాంకు ఆర్థిక పరిస్థితి, మూలధన నిల్వలపై నిర్వహించిన పరిశీలనలో తీవ్ర లోపాలు బయటపడటంతో పరాగ్వే సెంట్రల్ బ్యాంక్ (బీసీపీ) నవంబర్ 2న అత్యవసర నిర్ణయం తీసుకుంది.

నవంబర్ 3 తెల్లవారుజామున బ్యాంకుపై ప్రత్యేక పరిష్కార ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. బ్యాంకు చెల్లింపులు, లావాదేవీలపై ఆంక్షలు విధించి, ఆస్తులు, అప్పులు, ఆర్థిక పరిస్థితి తిని పరిశీలించేందుకు అధికారులను నియమించే చర్యలు చేపట్టింది. బ్యాంకు మూలధన సామర్థ్య -2 వ పేజీలో...

రాశి ఫలాలు

6.11.2026

మేషం: స్థిరాస్తి ఒప్పందాలలో పునరాలోచన చేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. చేపట్టిన వ్యవహారాలు కొంత మందకోడిగా సాగుతాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి.

వృషభం: నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. దూర ప్రయాణాలలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. సోదరులతో వివాదాలను తెలివిగా పరిష్కరించుకుంటారు.

మిథునం: గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. నిరుద్యోగ ప్రయత్నాలలో విజయం సాధిస్తారు.

కర్కాటకం: చిన్ననాటి మిత్రులతో విలువైన సమయాన్ని గడుపుతారు. చేపట్టిన పనులలో నూతన ప్రణాళికలు అమలుపరచి సకాలంలో పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాల్లో అధికారులతో మాట పట్టింపులు ఉంటాయి. వ్యాపారాలలో స్వల్ప లాభాలను అందుకుంటారు. కుటుంబ పెద్దలతో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి.

సింహం: భూ సంబంధిత వ్యాపారస్తులకు ఆశించిన లాభాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో దైవసేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులతో విలువైన సమయాన్ని గడుపుతారు. వృత్తి ఉద్యోగాల్లో అధికారులతో మాట పట్టింపులు ఉంటాయి. గృహమున కొందరి ప్రవర్తన వలన మానసికంగా ఇబ్బందికి గురవుతారు.

కన్య: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నూతన వ్యాపారాలు ప్రారంభించిన ఆశించిన లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాల్లో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. అన్ని రంగాల వారికి అనుకూల ఫలితాలు ఉంటాయి.

తుల: నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. మీ ఆలోచనలు కుటుంబ సభ్యులకు నచ్చే విధంగా ఉండవు. వాహన సంభందమైన సమస్యలు కలుగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలలో అవరోధాలు తొలగుతాయి. వ్యాపారాలలో స్వంత ఆలోచనలు అమలు పరచడం మంచిది. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలుంటాయి.

వృశ్చికం: శత్రు సమస్యలు తొలగుతాయి. ఆదాయ మార్గాలు సంతృప్తికరంగా సాగుతాయి. సన్నిహితుల నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. బంధువులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు లభిస్తాయి. కొన్ని వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది.

ధనస్సు: గృహమున కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అంది అవసరాలు తీరుతాయి. వ్యాపార ప్రారంభమునకు అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా సానుకూల ఫలితాలుంటాయి.

మకరం: నిరుద్యోగులకు చాలాకాలంగా వేచి చూస్తున్న అవకాశములు అందుతాయి. ఉద్యోగమున పనితీరుతో అధికారులను ఆకట్టుకుంటారు. సేవా కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కుంభం: సన్నిహితుల నుండి అందిన ఒక వార్త ఉత్సాహం కలిగిస్తుంది. అన్ని రంగాల వారికీ అనుకూల పరిస్థితులుంటాయి. వ్యాపార వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. చేపట్టే పనులను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేస్తారు.

మీనం: కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. చేపట్టిన పనులలో శ్రమ మరింత అధికం అవుతుంది. ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలు ఫలించవు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. దీర్ఘకాలిక ఋణ భారం అధికమౌతుంది. బంధు మిత్రులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి.

బ్యాంకింగ్ భూకంపం

మొదటి పేజీ తరువాయి

సూచీ చట్టబద్ధంగా అవసరమైన కనీస స్థాయిలో సగం కంటే కూడా దిగువకు పడిపోవడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. ఈ పరిణామం దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు రాజకీయ వ్యవస్థనూ కుదిపేసింది.

30 లక్షల మంది ఖాతాదారులకు కష్టాలు

2021లో కార్యకలాపాలు ప్రారంభించిన యుయెనో బ్యాంకు తక్కువ సమయంలోనే పరాగ్వేలో అత్యంత ప్రజాదరణ పొందిన డిజిటల్ బ్యాంకింగ్ సంస్థగా ఎదిగింది. దేశంలోని వయోజన జనాభాలో 60 శాతానికి పైగా ప్రజలు ఈ బ్యాంకు సేవలను వినియోగిస్తున్నట్లు అంచనా. దాదాపు 30 లక్షల మంది ఖాతాదారులు ఇందులో ఖాతాలు కలిగి ఉన్నారు. రోజుకు 30 లక్షలకు పైగా లావాదేవీలు నిర్వహించే స్థాయికి సంస్థ విస్తరించింది. అయితే సెంట్రల్ బ్యాంక్ చర్యలతో మొబైల్ బ్యాంకింగ్ సేవలు, నగదు బదిలీలు, కార్డు చెల్లింపులు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ ఖాతాల్లో ఉన్న డబ్బును తీసుకోలేకపోవడంతో నిత్యావసరాల కొనుగోలు నుంచి వైద్య ఖర్చుల వరకు అనేక అవసరాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. చిరు వ్యాపారులు, ఉద్యోగులు, సాధారణ కుటుంబాలపై ఈ ప్రభావం పడింది.

రూ.7 వేల కోట్లకుపైగా ప్రభుత్వ నిధులు

ఈ సంక్షోభం వ్యక్తిగత ఖాతాదారులకే పరిమితం కాలేదు. ప్రభుత్వానికి చెందిన భారీ మొత్తంలో నిధులు కూడా యుయెనో బ్యాంకులో ఉండటంతో సమస్య మరింత తీవ్రమైంది. వివిధ ప్రభుత్వ సంస్థలకు చెందిన సుమారు 85 కోట్ల డాలర్ల మేర నిధులు బ్యాంకు నిర్వహణలో ఉన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. ముఖ్యంగా పరాగ్వే సామాజిక భద్రత, పెన్షన్ సంస్థ ఐపీఎస్‌కు చెందిన సుమారు 35.5 కోట్ల డాలర్ల నిధులు బ్యాంకులో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇవి సంస్థ మొత్తం పెట్టుబడుల్లో దాదాపు 9 శాతానికి సమానమని అధికారిక వర్గాలు వెల్లడించినట్లు సమాచారం. దాదాపు 32 వేల మంది విశ్రాంత ఉద్యోగులు యుయెనో బ్యాంకు ద్వారా పెన్షన్లు పొందుతున్నారు. బ్యాంకుపై ఆంక్షలతో వారి ఖాతాల నిర్వహణలో అంతరాయం ఏర్పడింది. అయితే నవంబర్ నెల పెన్షన్లు, అదనపు వార్షిక ప్రయోజనాన్ని నవంబర్ 17న చెల్లిస్తామని ఐపీఎస్ ప్రకటించింది. ఇందుకోసం జీఎన్‌బీ, అట్లాస్, నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సహా ఏడు బ్యాంకులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టింది. యుయెనో ద్వారా పెన్షన్లు పొందుతున్న వారికి తాత్కాలికంగా ఇతర బ్యాంకుల్లో ఖాతాలు కేటాయించి చెల్లింపులు జరపాలని నిర్ణయించింది.

డిపాజిటర్లకు భరోసా..
తొలి విడతలో రూ.10 లక్షలు

ఖాతాదారుల సొమ్ముకు రక్షణ కల్పించేందుకు పరాగ్వే ప్రభుత్వం, సెంట్రల్ బ్యాంక్ చర్యలు చేపట్టాయి. దేశంలోని డిపాజిట్ హామీ చట్టం ప్రకారం ఒక్కో వ్యక్తి లేదా సంస్థకు ఒక్కో బ్యాంకులో గరిష్ఠంగా 75 కనీస నెలవారీ వేతనాలకు సమానమైన మొత్తం వరకు రక్షణ ఉంటుంది. ప్రస్తుతం ఇది 22.83 కోట్ల గురానీలకు (సుమారు 37,400 డాలర్లు) సమానం. ఈ పరిధిలోకి దాదాపు 97 శాతం మంది ఖాతాదారులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే నవంబర్ 3న సెంట్రల్ బ్యాంక్ ప్రకటించిన తొలి విడత చెల్లింపులో ఒక్కో డిపాజిటర్‌కు గరిష్ఠంగా కోటి గురానీలు (సుమారు 1,600 డాలర్లు) చెల్లించనున్నట్లు తెలిపింది. మిగిలిన అర్హతగల మొత్తాన్ని తదుపరి ప్రకటించే షెడ్యూల్ ప్రకారం చెల్లిస్తామని వెల్లడించింది. ఖాతాదారులకు బ్యాంకులో ఉన్న అప్పులు ఉంటే వాటిని మినహాయించిన తర్వాతే పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేసింది. హామీ పరిమితికి మించి డిపాజిట్లు ఉన్నవారి సొమ్ము తిరిగి లభించే అంశం మాత్రం బ్యాంకు ఆస్తులు, అప్పుల పరిశీలనపై ఆధారపడి ఉంటుంది.

బోగస్ లెక్కలు.. అనుబంధ సంస్థలకు రుణాలు

యుయెనో బ్యాంకు సంక్షోభానికి ఆర్థిక నిర్వహణలో తీవ్ర అవకతవకలు కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంకు యాజమాన్యానికి సంబంధం ఉన్న గ్రూపో వాజ్క్వెజ్ సంస్థలకు భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసినట్లు విచారణలో ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ రుణాల్లో కొన్నింటికి తగిన పత్రాలు, ఆర్థిక ఆధారాలు లేవని, రుణాల కేటాయింపులో నిబంధనలు ఉల్లంఘించారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆర్థిక నివేదికల్లో లెక్కల సర్దుబాట్లు, మూలధన నిల్వల విషయంలోనూ తీవ్ర లోపాలు గుర్తించారు. వీటిపై దర్యాప్తు చేపట్టిన అధికారులు బ్యాంకు నిర్వహణలో బాధ్యత వహించిన వారిపై చర్యలకు ఉపక్రమించారు.

వ్యవసాయ శాఖ సర్వర్లుభద్రమేనా

మొదటి పేజీ తరువాయి

నమోదు చేసే ఆడిట్ వ్యవస్థను నిర్వహించడం వంటి భద్రతా ప్రమాణాలు ఎంతవరకు అమలవుతున్నాయో వెల్లడించాలి.

ఏపీకే యాప్‌లకు అధికారిక అనుమతులున్నాయా?

క్షేత్రస్థాయి ఉద్యోగులు విధుల నిర్వహణకు వినియోగిస్తున్న ఏపీకే ఆధారిత యాప్‌ల భద్రతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ యాప్‌లను రూపొందించింది ఎవరు? ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? స్వతంత్ర సాంకేతిక నిపుణులతో వాటి భద్రతను పరీక్షించారా? అన్నది తెలియాల్సి ఉంది. ముఖ్యంగా యాప్‌లకు మొబైల్‌లోని ఫొటోలు, ఫైళ్లు, లొకేషన్ వంటి సమాచారాన్ని యాక్సెస్ చేసే అనుమతులు ఉంటే వాటి అవసరం, వినియోగాన్ని పరిశీలించాలి. రైతుల వివరాలను సేకరించే ఈ యాప్‌లలో భద్రతా లోపాలుంటే సమాచారం అనధికార వ్యక్తులకు చేరే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రస్తుతం వినియోగిస్తున్న యాప్‌లన్నింటినీ సాంకేతికంగా పరిశీలించి, అవసరమైతే సురక్షితమైన అధికారిక యాప్‌లను అందుబాటులోకి తీసుకురావాలి.

సర్వర్లకు సైబర్ ఆడిట్ జరిగిందా?

వ్యవసాయ శాఖ సర్వర్లు, డేటాబేస్‌లు, మొబైల్ యాప్‌లకు చివరిసారిగా ఎప్పుడు సైబర్ సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు? ఎలాంటి లోపాలు గుర్తించారు? వాటిని సరిచేశారా? అనే వివరాలు బయటకు రావాల్సి ఉంది. సర్వర్లలోకి అనధికార ప్రవేశాలను గుర్తించే వ్యవస్థ, బహుళ అంచెల గుర్తింపు విధానం, డేటా బ్యాకప్, సైబర్ దాడులను పర్యవేక్షించే యంత్రాంగం పటిష్ఠంగా ఉండాలి. మరోవైపు 2.73 లక్షల మంది రైతులకు వెళ్లినట్లు చెబుతున్న తప్పుడు సందేశాలు ఏ వ్యవస్థ ద్వారా పంపించారు? ప్రభుత్వ అధికారిక ఎస్ఎంఎస్ గేట్‌వేను వినియోగించారా? లేక ప్రైవేటు సంస్థల సేవలు ఉపయోగించారా? రైతుల ఫోన్ నంబర్ల జాబితా ఎక్కడి నుంచి వచ్చింది? ఈ వ్యవహారంలో వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం జరిగిందా? అన్నది సాంకేతిక విచారణలో తేలాల్సి ఉంది. డేటా లీక్ జరిగినట్లు ఇప్పటివరకు నిర్ధారణ కాకపోయినా, ఆ అవకాశాన్ని తోసిపుచ్చకుండా సమగ్రంగా పరిశీలించాలి.

ఐటీ వ్యవస్థల్లో ప్రక్షాళన ఎప్పుడు?

రైతుల నుంచి భారీ స్థాయిలో వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్న వ్యవసాయ శాఖ, దాని భద్రతకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి. సర్వర్లు, యాప్‌లు, డేటాబేస్‌లపై స్వతంత్ర సైబర్ భద్రతా ఆడిట్ నిర్వహించి లోపాలను సరిచేయాలి. ఉద్యోగులకు సురక్షితమైన అధికారిక యాప్‌లు అందించడంతోపాటు, రైతుల డేటా రక్షణకు ప్రత్యేక బాధ్యత వహించే అధికారిని నియమించాలి. ముఖ్యమంత్రి పేరుతో వెళ్లిన తప్పుడు సందేశాల మూలాలను గుర్తించి విచారణ వివరాలను ప్రజలకు వెల్లడించాలి. రైతుల ఆధార్, బ్యాంకు, భూమి వివరాలు సురక్షితంగా ఉన్నాయనే భరోసాను శాఖ కల్పించాలి. లక్షలాది మంది రైతుల వ్యక్తిగత సమాచారం భద్రతకు బాధ్యత వహించేది ఎవరు? ఏపీకే యాప్‌లపై సైబర్ సెక్యూరిటీ ఆడిట్ ఎప్పుడు నిర్వహిస్తారు? వ్యవసాయ శాఖ సర్వర్ల భద్రతపై ప్రభుత్వం ఎప్పుడు స్పష్టత ఇస్తుంది? ఈ ప్రశ్నలకు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

అరెస్టు చేసినప్పటి నుంచే 24 గంటల లెక్క

మొదటి పేజీ తరువాయి

అవసరమైన సమయాన్ని మినహాయించి 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలి. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా అంతకుమించి నిర్బంధంలో ఉంచడానికి వీల్లేదు. సోదాలు, స్వాధీనం ప్రక్రియ పూర్తయ్యాక పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని భావించడం చట్టవిరుద్ధమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాస్తవంగా నిర్బంధించిన సమయం నుంచి 24 గంటలు దాటినా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే సంబంధిత వ్యక్తిని వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ గడువును లెక్కించేటప్పుడు అరెస్టు చేసిన ప్రాంతం నుంచి మేజిస్ట్రేట్ కోర్టుకు చేరుకోవడానికి పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించాలని స్పష్టం చేసింది. అంతేకాదు, 24 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరుపరిచినంత మాత్రాన నిర్బంధం చట్టబద్ధమైనట్లు కాదని ధర్మాసనం తెలిపింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 58 ప్రకారం.. కేసు పరిస్థితులకు అనుగుణంగా నిర్బంధ సమయం సహేతుకంగా ఉండేలా దర్యాప్తు సంస్థలు చూసుకోవాలని పేర్కొంది. నిందితుడిని తమ ఎదుట హాజరుపరిచినప్పుడు అతడి స్వేచ్ఛకు భంగం కలిగించిన అసలు తేదీ, సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు పాటించారా? లేదా? అన్నది స్వతంత్రంగా పరిశీలించాలని సూచించింది. నిర్బంధం సహేతుకమైన సమయాన్ని మించిందని భావిస్తే తదుపరి రిమాండ్‌కు అనుమతి నిరాకరించే అధికారం మేజిస్ట్రేట్‌కు ఉంటుందని స్పష్టం చేసింది.

కాంగ్రెస్ నుంచి 200 మంది సస్పెండ్

మొదటి పేజీ తరువాయి

ప్రదేశ్‌లలో చెరో 13, హర్యానాలో 10 మందిని సస్పెండ్ చేశారు. ఈ సంఖ్య 500 వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సస్పెన్షన్లపై యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ స్పందించారు. పార్టీలో జవాబుదారీతనాన్ని పెంచేందుకే ఈ చర్యలు తీసుకున్నామని సమర్థించుకున్నారు. చురుగ్గా పనిచేసే కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించేందుకు ఇది దోహదపడుతుందని, భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలకు హాజరు శాతం పెంచడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అయితే, మేనమామ పెద్దకర్మకు హాజరైనందుకు తనను సస్పెండ్ చేయడంపై ఓ యువజన నాయకుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం ఈ వ్యవహారానికి కేంద్ర బిందువుగా మారింది. వివరాల్లోకి వెళితే.. యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న రోహిత్ రజోరియా, తన మేనమామ మరణానంతర కర్మకాండల (తెర్వి) కారణంగా రాహుల్ ర్యాలీకి హాజరుకాలేదు. ఈ విషయం గురించి తాను ముందుగానే పార్టీ నాయకత్వానికి సమాచారం ఇచ్చానని, అందుకు సంబంధించిన కార్డును కూడా చూపించానని ఆయన తెలిపారు. అయినప్పటికీ, కనీసం వివరణ కోరకుండా తనను ఏకపక్షంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. గత 15 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నానని, అనేకసార్లు పార్టీ నిరసనల్లో పాల్గొని కేసులు, జైలు జీవితం కూడా అనుభవించానని, అయినా తన సేవలను గుర్తించకపోవడం బాధాకరమని అన్నారు. యూత్ కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి సభ్యులందరూ ఈ ర్యాలీకి తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ ముందుగానే ఆదేశాలు జారీ చేసింది. హాజరును ట్రాక్ చేసేందుకు బార్‌కోడ్ స్కానర్లు, "విత్ ఐవైసీ" అనే ప్రత్యేక యాప్‌ను ఉపయోగించారు. సుమారు 15,000 మంది కార్యకర్తలు వచ్చారని నాయకులు చెబుతున్నా, సాంకేతిక సమస్యలు, కనెక్టివిటీ లోపాల వల్ల కేవలం 2,831 మంది మాత్రమే డిజిటల్‌గా రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిసింది. చాలామంది ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ర్యాలీకి గైర్హాజరయ్యారు.

బీసీ భవనాలకు 88.5 కోట్లు

మొదటి పేజీ తరువాయి

అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. గతంలో భూములు కేటాయించినప్పటికీ, కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సహకారంతో ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పారు. స్థలాలను 'రెడీ-టు-కన్‌స్ట్రక్ట్' పద్ధతిలో లేఅవుట్లతో అభివృద్ధి చేశామని, ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినందున కుల సంఘాలు తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. సంవత్సరంలోగా ఈ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులను ఇంజనీరింగ్ విభాగం, హెచ్ఎండీఏ సమన్వయంతో 'సింగిల్ విండో' విధానంలో జాప్యం లేకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాల పురోగతిపై బీసీ సంక్షేమ శాఖ ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు. బీసీ కుల సంఘాలకు కేటాయించిన ప్లాట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. ఈ భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటిని ఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోదని భరోసా ఇచ్చారు. కేటాయించిన నిధులతో నిర్దిష్ట సమయంలోగా భవనాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా సంఘాలపై ఉందని, జాప్యం జరిగితే సంఘాల ప్రతినిధులనే జవాబుదారీ చేస్తామని హెచ్చరించారు. అన్ని బీసీ కుల సంఘాలు సమావేశాలు, జయంతులు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా హైదరాబాద్‌లో ఐదు ఎకరాల స్థలంలో ఒక సమగ్ర 'బీసీ భవన్' నిర్మించాలనే ప్రతిపాదనను కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్తావించారు.

పచ్చిగుడ్ల మయోనైజ్‌పై మరో ఏడాది నిషేధం

మొదటి పేజీ తరువాయి

కొన్ని ప్రాంతాల్లో మోమోస్ తిని ఒక మహిళ మృతి చెందడంతో పాటు చాలా మంది తీవ్రంగా అస్వస్థతకు గురైన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఈ ఘటనపై విచారణ జరిపిన అధికారులు సరిగా నిల్వ చేయని పచ్చిగుడ్ల మయోనైజ్ వల్ల బ్యాక్టీరియా చేరి ఆహారం విషపూరితంగా మారిందని గుర్తించారు. దీంతో ప్రభుత్వం తొలుత సంవత్సరం పాటు బ్యాన్ విధించింది. ప్రస్తుతం ఆ నిషేధ కాలపరిమితి పూర్తయినప్పటికీ, ప్రజల ఆరోగ్య భద్రతను దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా నిబంధనలను పొడిగించడమే శ్రేయస్కరమని ప్రభుత్వం భావించింది. హోటళ్ళు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో దీని వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని ఆదేశించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆహార భద్రతా అధికారులు హెచ్చరించారు.

నందిని పనీర్ ధరలు పెంపు

మొదటి పేజీ తరువాయి

ఈ కొత్త సవరణ ప్రకారం, ఒక లీటర్ నందిని నెయ్యి ప్యాకెట్ ధర రూ.715 నుండి ఏకంగా రూ.850కి పెరిగింది. అదేవిధంగా, 500 గ్రాముల అన్‌సాల్టెడ్ వెన్న ధర రూ.285 నుండి రూ.390కి, కిలో పనీర్ ప్యాకెట్ ధర రూ.408 నుండి రూ.485కి పెరిగాయి. పండుగ సీజన్‌తో మార్కెట్లో ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం, సరఫరా కొరత ఏర్పడటంతో అమూల్ ధరలను పెంచిన మరుసటి రోజే నందిని కూడా ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అయితే, ఈ ధరల పెంపుపై ఆ రాష్ట్రంలో తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో నిరసనకారులు పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఉప ముఖ్యమంత్రి డీ.కె. శివకుమార్ ఈ నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, రాష్ట్రంలో11 లక్షల పాడి రైతులకు మేలు చేసేందుకే ఈ సవరణ అవసరమైందని స్పష్టం చేశారు. కర్ణాటకలో ధరలు తక్కువగా ఉండటంతో పాలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని, ఈ పెంపు తర్వాత రోజుకు 10 లక్షల లీటర్ల పాలు తిరిగి రాష్ట్ర డెయిరీలకు అందుబాటులోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

కాళేశ్వరం కథ అసెంబ్లీకి!

మొదటి పేజీ తరువాయి

దాన్ని ఎందుకు ఎత్తిపోస్తున్నారంటూ వస్తున్న విమర్శలపై కూడా కేబినెట్ సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుత నీటిమట్టం, బరాజ్‌ల పరిస్థితుల దృష్ట్యా అక్కడి నుంచి నీటిని ఎత్తిపోయడం సాంకేతికంగా సాధ్యం కాదని ఇంజనీర్లు వివరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. మేడిగడ్డ నుంచి ఎత్తిన నీరు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల గేట్లు మూసివేయాల్సి ఉంటుందని.. అయితే భద్రతా కారణాలతో ఆ గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ సూచించిన విషయాన్ని అధికారులు వివరించారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ మూడు బరాజ్‌ల పునరుద్ధరణకు సుమారు రూ.4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నిర్మాణ లోపాల కారణంగా చేపట్టాల్సిన మరమ్మతుల ఖర్చును సంబంధిత నిర్మాణ సంస్థలే భరించేలా.. అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. ప్రాథమిక పునరుద్ధరణ ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని కూడా వెల్లడించారు. ఈ నెలాఖరులోగా తుది అనుమతులు పొందేందుకు ప్రయత్నించాలని.. ఈ ఏడాది చివరిలోగా పనులు ప్రారంభించాలని సీఎం రేవంత్ అధికారులకు ఆదేశించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని తిరిగి సాధించే పనులు, బరాజ్‌ల రక్షణకు చేపట్టాల్సిన చర్యలను రెండు దశలుగా విభజించాలని సూచించారు. పనుల్లో ఆలస్యం జరగకుండా అనుమతులు, సాంకేతిక పరిశీలనలు, ఇతర ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని చెప్పారు. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునేందుకు దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని తరలించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. ప్రస్తుత ప్రభుత్వం 3 ఏళ్లలో సగటున 18.13 టీఎంసీలకు పెరిగిందని తెలిపారు. ఇది గతంతో పోలిస్తే 89 శాతం అధికమని పేర్కొన్నారు. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు.. మొత్తంగా 24.81 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ నెలాఖరులో రెండు రోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గత 3 ఏళ్లలో ప్రాజెక్టు మరమ్మతులు, బరాజ్‌ల పునరుద్ధరణకు తీసుకున్న చర్యలను సభలో వివరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

29, 30 తేదీల్లో యూపీఎస్సీ ఈ మెయిన్స్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. అంతకుముందు జరిగిన ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన 13,343 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు హాజరయ్యారు. మొత్తం 1,016 సివిల్ సర్వీసెస్ పోస్టుల భర్తీ లక్ష్యంగా

ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై శిక్షణ

ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల బాధ్యతలపై అవగాహన.. సీపీసీబీ ఆన్‌లైన్ పోర్టల్ వినియోగంపై ఆచరణాత్మక శిక్షణ

టీజీపీసీబీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 5 (పీఐబీ): ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026పై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ పర్యావరణ భవన్‌లో అవగాహన, ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొత్త నిబంధనల ప్రకారం ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు, పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలు నిర్వర్తించాల్సిన చట్టబద్ధమైన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో ఈ శిక్షణ నిర్వహించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026కు రాష్ట్ర నోడల్ అధికారిగా, రాష్ట్ర ప్రధాన శిక్షకురాలిగా వ్యవహరిస్తున్న టీజీపీసీబీ సీనియర్ పర్యావరణ ఇంజినీర్ ఎం. సుజనా శ్రీ శిక్షణ ఇచ్చారు. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. పురపాలన,



పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు, పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, పెద్ద మొత్తంలో వ్యర్థాలు ఉత్పత్తి చేసేవారు నిర్వర్తించాల్సిన చట్టబద్ధమైన బాధ్యతలను వివరించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిర్వహించే ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్ వినియోగంపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. పోర్టల్‌లో నమోదు చేసుకోవడం నుంచి దాని వినియోగం వరకు వివిధ దశలను ఆచరణాత్మకంగా వివరించారు. వినియోగదారుల ఖాతాల ఏర్పాటు, దరఖాస్తుల సమర్పణ, పరిశీలన, వివరాల నమోదు, వ్యర్థాల నిర్వహణ కేంద్రాల నమోదు, భౌగోళిక గుర్తింపు, తనిఖీలు, వార్షిక నివేదికల సమర్పణ వంటి అంశాలను ప్రదర్శించారు. అలాగే పెద్ద మొత్తంలో వ్యర్థాలు ఉత్పత్తి చేసేవారికి సంబంధించిన విస్తృత బాధ్యతల కింద జారీ చేసే ధ్రువపత్రాలు, అప్పీళ్లు, ఫిర్యాదుల పరిష్కారం, పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఇతర సదుపాయాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సంస్థల ప్రతినిధులు తమకు కేటాయించిన లాగిన్ విధానాలను ఉపయోగించి పనులను స్వయంగా పూర్తి చేసుకునేలా శిక్షణ అందించారు. నిబంధనల అమలులో వివిధ శాఖలు, అధికారుల మధ్య సమన్వయం, పర్యవేక్షణ, నిబంధనల పాటింపు వివరాల నివేదన, కేంద్రీకృత పోర్టల్‌లో సంబంధిత సమాచార నిర్వహణ వంటి అంశాల్లో ఆయా విభాగాల పాత్రను కూడా వివరించారు.

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి

రేవంత్ సర్కారుకు కవిత నెల రోజుల డెడ్‌లైన్

కాంగ్రెస్ వచ్చాక 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపణ

సీఎం సోదరులే డబ్బులు దండుకుంటున్నారని వ్యాఖ్య

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్‌లో అక్రమాలు

మూల్యాంకనంలో అవకతవకలు

ఓ ప్రైవేట్ సంస్థకు చెల్లింపులు: ఈడీ

విజయవాడ, నవంబర్ 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్షాపత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం కీలక ప్రకటన చేసింది. మూల్యాంకనంలో అక్రమాలు జరిగినట్టు గుర్తించామని తెలిపింది. పీఎంఎల్ఏ చట్టం కింద కేసు నమోదుచేసి.. దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు పేర్కొంది. నవంబరు 4న సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరులోని ఏడు చోట్ల తనిఖీలు జరిపి.. డిజిటల్ పరికరాలు, కీలక ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని, ప్రైవేట్ సంస్థకు రూ. 1.14 కోట్లు చెల్లింపులు జరిగినట్టు గుర్తించామని ఈడీ వివరించింది. దర్యాప్తు కొనసాగుతోందని ప్రకటించింది. మనీల్యాండరింగ్‌పై ఆధారాలు సేకరించామని ఈడీ చెప్పింది. క్యామ్‌సైన్ మీడియా, ఇతర సంస్థల ఆఫీసుల్లోనూ.. ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి సీతారామాంజనేయులు నివాసంలో సోదాలు చేసింది. గ్రూప్-1 పోస్టులకు 2018లో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా.. 2020లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ ఆన్సర్ పత్రాలను అర్హత లేని 66 మందితో దిద్దించినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఏప్రిల్ 2025లో విజయవాడలోని సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. విచారణకు ఏపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటుచేసింది. అనంతరం మనీల్యాండరింగ్ ఆరోపణలు కూడా రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. బంజారాహిల్స్‌లోని క్యామ్‌సైన్ మీడియా కార్యాలయం, ఆ సంస్థ ఎండీ పి.మధుసూదనరావు నివాసంలో శుక్రవారం ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అలాగే, సికింద్రాబాద్ డిఫెన్స్ కాలనీలోని ట్రూగ్రేడర్ సర్వీసెస్ ఆఫీసు, నేరేడ్‌మెట్‌లో అక్కెల్లపెరి శ్రీనివాసరావు, అల్వాల్‌లో మహంకాళి రఘురామ్‌కు సంబంధించిన ఇళ్లలోనూ సోదాలు జరిగాయి. గుంటూరులోని చినకాకానిలో ఉన్న ఆవాస రిసార్ట్ హోయ్‌లాండ్‌లోనూ తనిఖీలు జరిగాయి.

ఎమ్మెల్యే వీరేశంకు తప్పిన ప్రమాదాలు

గంటల వ్యవధిలో రెండు ప్రమాదాలు

నల్గొండ, నవంబర్ 5 (ఈవార్తలు): ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఒకే రోజు గంటల వ్యవధిలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల నుంచి తృటిలో సురక్షితంగా బయటపడ్డారు. నల్గొండ జిల్లాలో గురువారం ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఆయన ప్రయాణిస్తున్న రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఆయనకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అనుచరులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే వీరేశం గురువారం నకిరేకల్ నుంచి చిట్యాల మండలం చినకాపర్తికి తన ఫార్చ్యూనర్ వాహనంలో బయలుదేరారు. కట్టంగూరు మండలం చెర్వు అన్నారం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై వెళుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కార్నివాల్ కారు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తాకిడికి ఎమ్మెల్యే కారు ముందు వెళుతున్న ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొంది. ప్రమాద తీవ్రతకు కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఎయిర్‌బ్యాగ్‌లు వెంటనే తెరుచుకోవడంతో వీరేశం సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన జరిగిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమై, ఎమ్మెల్యేను మరో ఇన్నోవా క్రిస్టా కారులోకి మార్చి గమ్యస్థానానికి పంపించారు.

హైదరాబాద్‌లో జిల్లా స్థాయి యువజన పార్లమెంట్

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అంశంపై విద్యార్థుల చర్చలు



హైదరాబాద్, నవంబర్ 5 (పీఐబీ): 'వికసిత్ భారత్ యువజన పార్లమెంట్-2027' జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మేరా యువ భారత్ (మై భారత్) హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత క్రియాశీల పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ విలువలు, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. యువజన పార్లమెంట్ వేదిక ద్వారా తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తపరచాలని ప్రోత్సహించారు. మై భారత్ తెలంగాణ రాష్ట్ర సంచాలకుడు అన్వేష్ చింతల సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, యువతలో నాయకత్వ లక్షణాల పెంపునకు వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. హైదరాబాద్ జిల్లా యువజన అధికారి (ఇన్‌చార్జి) జి. రాజేష్ మాట్లాడుతూ.. 2019లో ప్రారంభమైన జాతీయ యువజన పార్లమెంట్ ఉత్సవం నుంచి వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ వరకు ఈ కార్యక్రమం పరిణామాన్ని, లక్ష్యాలను వివరించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థుల ప్రసంగాలను భారతీయ స్టేట్ బ్యాంకు మాజీ ముఖ్య మేనేజర్ ఎన్. రామ్‌మోహన్, పీఐబీ హైదరాబాద్ మీడియా, సమాచార అధికారి వి. గాయత్రి, కేంద్ర హోంశాఖ అధికార భాషా విభాగం సహాయ సంచాలకుడు డాక్టర్ ఎస్. రవిచంద్ర, మై భారత్ హైదరాబాద్ మాజీ జిల్లా యువజన అధికారి ఆర్. శశాంక్, తెలంగాణ ప్రభుత్వ జిల్లా యువజన, క్రీడల అధికారి నరసింహ గౌడ్‌లతో కూడిన న్యాయనిర్ణేతల బృందం మూల్యాంకనం చేసింది. దీపావళి స్నేహమిలన్ వేడుకల్లో భాగంగా జాతీయ యువజన స్వచ్ఛంద సేవకులకు మిఠాయిలు పంపిణీ చేశారు. మై భారత్ న్యూఢిల్లీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను యువత అనుసరించాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను, ప్రచార కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో ఉదయశ్రీ, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమ అధికారి, మై భారత్ సిబ్బంది, జాతీయ యువజన స్వచ్ఛంద సేవకులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. జాతీయ అంశాలపై అభిప్రాయాలు వెల్లడించడం, పార్లమెంటరీ విధానాలను తెలుసుకోవడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఈ యువజన పార్లమెంట్ విద్యార్థులకు వేదికగా నిలిచింది.

ఏపీకి మరో తుఫాను ముప్పు

కలవరపడుతున్న కోస్తాంధ్ర



వైజాగ్, నవంబర్ 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను వరుసగా తుపాన్లు, భారీ వర్షాలు తీవ్ర అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో త్వరలోనే మరో తుపాను రానుందనే హెచ్చరికలు తీవ్ర ఆందోళన పెంచుతున్నాయి. నవంబర్ రెండో వారం తర్వాత బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ చేసిన అంచనాలు ఇప్పుడు తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో కోస్తాంధ్రతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మరోసారి వర్షాలు కురుస్తాయా? కొత్త తుపాను ఏర్పడుతుందా? అనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం కొత్త తుపాను ముప్పు ఖరారు కాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎన్‌డీఎంఏ) నవంబర్ 5వ తేదీన వెల్లడించిన వాతావరణ నమూనాల సమాచారం ప్రకారం.. బంగాళాఖాతంలో ఒక వాతావరణ వ్యవస్థను మోడళ్లు గమనిస్తున్నాయి. అయితే ఇది ప్రస్తుతం మోడల్ అంచనా మాత్రమేనని.. తుపాను, అధికారిక హెచ్చరిక కాదని సంస్థ స్పష్టం చేసింది. అందుబాటులో ఉన్న అంచనాల్లో ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన తుపాను ముప్పు లేదని పేర్కొంది. ఏపీ తీరాన్ని తుపాను తాకే అవకాశాన్ని కూడా చాలా తక్కువగా చూపించింది. కొన్ని ప్రాథమిక వాతావరణ అంచనాల్లో నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలతో పాటు ఉత్తర తమిళనాడు తీర ప్రాంతాలపై ఆ తుపాను ధాటికి వర్షాల ప్రభావం ఉండొచ్చనే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రస్తుతం సమాచారం లేదు. వాతావరణ వ్యవస్థ ఏర్పడితే దాని కదలిక, తీవ్రత, సముద్రంపై ప్రయాణించే దిశను బట్టి ప్రభావిత ప్రాంతాలు మారవచ్చు. మరోవైపు.. స్కైమెట్ వెదర్ నవంబర్ 5వ తేదీన విడుదల చేసిన అంచనా ప్రకారం.. మురసు తుపాను అవశేషంగా ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలహీనపడనుంది. నవంబర్ 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం మెరుగుపడే అవకాశం ఉందని ఆ సంస్థ పేర్కొంది. ఇటీవల అర్నాబ్, మురసు తుపాన్ల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలు భారీ వర్షాలు, ఈదురుగాలులను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా తీరప్రాంతాల్లో పంటలు, రహదారులు, ఇతర ఆస్తులకు నష్టం వాటిల్లింది. మురసు తుపాను బలహీనపడి అల్పపీడనంగా మారినప్పటికీ దాని అవశేష ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో మరో వాతావరణ వ్యవస్థ ఏర్పడుతుందనే అంచనాలు రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని వాతావరణ కథనాల్లో కొత్త వ్యవస్థ తుపానుగా మారితే 'అక్వాస్' అనే పేరు పెట్టే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే ప్రస్తుతానికి కొత్త తుపాను ఏర్పడినట్లు అధికారిక ప్రకటన లేదు. అందువల్ల ఆ పేరును ఖరారైన తుపాను పేరుగా పేర్కొనడం తొందరపాటే అవుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో బంగాళాఖాతంలో తుపాన్లు ఏర్పడే అవకాశాలు సాధారణంగా ఎక్కువగా ఉంటాయి. అయినప్పటికీ ప్రతి అల్పపీడనం తుపానుగా మారుతుందని చెప్పలేమని చెబుతున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, గాలుల దిశ, వాతావరణంలోని ఇతర పరిస్థితులపై దాని తీవ్రత తుపాను ఏర్పాటుపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి రాబోయే రోజుల్లో ఐఎండీ విడుదల చేసే బులెటిన్లు, ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ సూచనలను ప్రజలు గమనించాలని అధికారులు పేర్కొంటున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే విషయంలో అధికారిక హెచ్చరికలను పాటించాలని.. రైతులు పంటల రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఏపీలో ముగిసిన జడ్పీ పోలింగ్

రేపు కౌంటింగ్

విజయవాడ, నవంబర్ 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా పోలింగ్ ప్రక్రియ చాలా వరకు ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55% పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనగా, కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం కాస్త తక్కువగా నమోదైనట్లు సమాచారం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన సుమారు 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే సాగినప్పటికీ, పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్ బాంబులతో దాడులు జరిగాయి. కొన్ని చోట్ల ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనల వల్ల పోలింగ్‌కు పెద్దగా అంతరాయం కలగలేదు. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఏవైనా కేంద్రాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే, నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమైతే చర్యలేవి?

మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న

బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.



హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు. 'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. నత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



నేరెళ్లలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

బీఆర్ఎస్, బీజేపీల నుంచి 300 మందికి పైగా రాక

కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి అడ్లూరి

ధర్మపురి, నవంబర్ 5 (ఈవార్తలు): ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 300 మందికి పైగా నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ కాసారపు బాలగౌడ్, ఇతర నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరై వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకంతోనే ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ధర్మపురి నియోజకవర్గంలో గత పాలనలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకే యువ సంవాద్ : బీజేవైఎం

జగిత్యాల, నవంబర్ 5 (ఈవార్తలు): 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని బీజేవైఎం నాయకులు పిలుపునిచ్చారు. యువతలో చైతన్యం తీసుకురావడమే యువ సంవాద్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఇట్టేడి రాజు (శేఖర్ రెడ్డి) ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు కొండ్ర రవితేజ అధ్యక్షతన వికసిత్ భారత్-2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలంటే యువత విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నూతన ఆవిష్కరణల ద్వారా దేశ పురోగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయాలను కళాశాల విద్యార్థుల్లోకి తీసుకెళ్లడమే యువ సంవాద్ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పూదరి పవన్, అమధ రాజు, బీజేపీ ఉపాధ్యక్షుడు పవన్ సింగ్, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నవీన్ పటేల్‌కు ఘన సన్మానం

వేములవాడ అర్బన్, నవంబర్ 5 (ఈవార్తలు): సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వేములవాడ పట్టణ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన చేకూర్తి నవీన్ పటేల్‌ను సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ముందుంటూ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పదవి దక్కడం సంతోషంగా ఉందని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నవీన్ పటేల్ మాట్లాడుతూ.. తనను ఆహ్వానించి సన్మానించిన సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏద్దండి రాజు, వాసాల హరి ప్రసాద్, గొంటి నవీన్, పబ్బ సురేష్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

79 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేత

కొడిమ్యాల, నవంబర్ 5 (ఈవార్తలు): కొడిమ్యాల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 79 మంది లబ్ధిదారులకు ఈ పథకాల చెక్కులు అందజేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.29,52,000 విలువైన చెక్కులను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూప, సర్పంచ్ జీవన్ రెడ్డి, రాజనర్సింగారావు, చిలువేరు నారాయణ తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థుల సమస్యల

పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఉర్దూ విద్యార్థులకు ఉచితంగా మార్గదర్శక పుస్తకాల పంపిణీ.. 150 మంది విద్యార్థినులకు పుస్తకాల కొనుగోలుకు ఆర్థిక సాయం

జగిత్యాల, నవంబర్ 5 (ఈవార్తలు): విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నాంపల్లి ఎమ్మెల్యే మసీద్ హుస్సేన్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సలార్ ఈ మిలాద్ కార్యక్రమంలో భాగంగా పదో తరగతి ఉర్దూ మాధ్యమ విద్యార్థులకు ఉచితంగా మార్గదర్శక పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. జగిత్యాల ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రెండు పడవలపై ప్రయాణం చేసేవారు చివరకు రెండింటినీ ముంచుతారంటూ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఇదిలా ఉండగా, జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థినులు తమకు ప్రభుత్వం నుంచి పుస్తకాలు అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించగా స్పందించిన మసీద్ హుస్సేన్ పుస్తకాల కొనుగోలుకు అవసరమైన డబ్బులను స్వయంగా చెల్లించారు. కార్యక్రమంలో జగిత్యాల పట్టణానికి చెందిన ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో

సకల సౌకర్యాలు: ఆది శ్రీనివాస్



కోనరావుపేట, నవంబర్ 5 (ఈవార్తలు): ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రజా ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, వసతి గదులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.56 లక్షలతో నూతన వసతి గృహం, మరుగుదొడ్ల నిర్మాణానికి, రూ.9.50 లక్షలతో భవిత కేంద్రం నిర్మాణానికి, రూ.30 లక్షలతో ఐకేపీ గోదాం నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కేజీబీవీ, భవిత కేంద్రం, ఐకేపీ గోదాం నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను ప్రణాళిక ప్రకారం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఐకేపీ గోదాం నిర్మాణ పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం: జీవన్ రెడ్డి



జగిత్యాల, నవంబర్ 5 (ఈవార్తలు): గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్ పాలనలోనే సాధ్యమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం సారంగాపూర్ మండలం ధర్మనాయక్ తండాలోని సేవాలాల్ మందిరంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 6 శాతంగా ఉన్న గిరిజన రిజర్వేషన్లను తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 10 శాతానికి పెంచిందని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతోపాటు రోడ్లు, మురుగు కాలువలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, మిషన్ భగీరథ, వైకుంఠధామాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ప్రతి జిల్లాకు వైద్య కళాశాలలు మంజూరు చేసి వైద్య విద్యకు అవకాశాలు పెంచిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేసిన కేసీఆర్ ప్రభుత్వం, తుమ్మడిహట్టి ప్రాజెక్టును ప్రస్తుత ప్రభుత్వం నిర్మించలేకపోతోందని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న కొన్ని నిర్మాణ పనులకు సైతం బీఆర్ఎస్ హయాంలోనే అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు సంతోష్, రమేష్, రమ భాస్కర్, మండల అధ్యక్షుడు తేలు రాజు, సత్యంరావు, ఆకుల రాజిరెడ్డి, చిరంజీవి, ఆనంద్ రెడ్డి, గంగాధర్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు

ముందస్తు చర్యలు చేపట్టాలి: కల్వకుంట్ల సంజయ్



కోరుట్ల, నవంబర్ 5 (ఈవార్తలు): పట్టణ ప్రజలకు భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సూచించారు. ఏకిన్‌పూర్ శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి మార్గం ద్వారా తాళ్ల చెరువును నింపి, అక్కడ నీటిని శుద్ధి చేసి పట్టణ ప్రజలకు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడినా, కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రత్యామ్నాయ విధానం ద్వారా నిరంతరాయంగా తాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు. నీటి మార్గం పనుల వల్ల రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందుగా వారితో చర్చించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జీవకర్, తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమిషనర్‌తో పాటు నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం: జగిత్యాల ఎస్పీ



జగిత్యాల, నవంబర్ 5 (ఈవార్తలు): పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు ఎంతో విలువైనవని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ చేసిన హోంగార్డులు నరసింహులు, వెంకయ్యలకు పదవీ విరమణ ప్రయోజనాల కింద ఒక్కొక్కరికి రూ.1.30 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ హోంగార్డులు సమర్థవంతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా వారి సంక్షేమానికి పోలీసు శాఖ ప్రాధాన్యత ఇస్తుందని, ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సైదులు పాల్గొన్నారు.

భూతల్లిని కాపాడుకుందాం



కరీంనగర్, నవంబర్ 5 (ఈవార్తలు): నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి రవితేజ అన్నారు. మియాపూర్ గ్రామంలో నిర్వహించిన కేతి బచావో అభియాన్ కార్యక్రమంలో ఆయన, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వెంకన్న పాల్గొని రైతులకు నేల ఆరోగ్యం, భూసార పరీక్షలు, నేల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవో రవితేజ మాట్లాడుతూ.. భూతల్లిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని నేలలోని పోషకాల స్థాయిని తెలుసుకోవాలని సూచించారు. అవసరానికి అనుగుణంగా ఎరువులు వినియోగిస్తూ సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి భూమి సారవంతాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. నేలలోని పోషకాలను గుర్తించేందుకు భూసార పరీక్షలు ఉపయోగపడతాయని వివరించారు. నేల స్వభావానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సమతుల్య ఎరువుల వినియోగం, పంట మార్పిడి, పచ్చిరొట్ట ఎరువుల వాడకంతో నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. నేల కోతను నివారిస్తూ సహజ వనరులను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.



రాజకీయం వ్యాపారం కాదు: యర్రం వెంకటరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): రాజకీయం వ్యాపారం కాదని, అది ప్రజాసేవకే పరిమితం కావాలని ఆల్ ఇండియా కూర్మి క్షత్రియ మహాసభ జాతీయ కన్వీనర్, సామాజికవేత్త యర్రం వెంకటరెడ్డి అన్నారు. ఐదేళ్లు పదవిలో ఉన్న మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు జీవితకాల పెన్షన్లు అందించడం సమంజసం కాదని, వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో రాజకీయ, విద్యా, వైద్య రంగాల్లో సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు తమ ఆస్తులను ఏటా పారదర్శకంగా తనిఖీ చేయించుకోవాలని సూచించారు. అవినీతికి పాల్పడినా, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయినా ప్రజాప్రతినిధులను పదవి నుంచి వెనక్కి పిలిచే 'రైట్ టు రీకాల్' చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 500 పడకల అత్యాధునిక ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆసుపత్రులను దశలవారీగా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకొచ్చి దేశ పౌరులందరికీ ఉచిత వైద్యం అందించాలని సూచించారు. ప్రైవేటు విద్యాసంస్థల వ్యాపారాన్ని అరికట్టి ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, భోజనం, పుస్తకాలు, డిజిటల్ తరగతులు అందుబాటులోకి తేవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకునేలా నిబంధనలు తీసుకొస్తే వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. గ్రామాల్లోనే నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి వలసలను అరికట్టాలని, స్వచ్ఛ భారత్ నినాదాన్ని ఆచరణలో చూపేలా ప్రతి నియోజకవర్గంలో పారిశుద్ధ్య విభాగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ మార్పుల కోసం పార్లమెంట్ తగిన చట్ట సవరణలు చేయాలని, అంశాలపై దేశవ్యాప్తంగా ప్రజలు చైతన్యవంతమై చర్చించాలని పిలుపునిచ్చారు.



జగిత్యాలలో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు టీఆర్టీఎఫ్ వినతి

జగిత్యాల, నవంబర్ 5 (ఈవార్తలు): నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు వైద్యుల సంప్రదింపు సేవలు అందించేందుకు జగిత్యాలలో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేయాలని టీఆర్టీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు టీఆర్టీఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేష్, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జగిత్యాలలో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయిని విజయానందరావు, రాష్ట్ర కార్యదర్శి గుర్రం రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంగడి రవీందర్, రాష్ట్ర బాధ్యులు భీమ పవన్ కుమార్, మహిపాల్, సమీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొడిమ్యాల, నవంబర్ 5 (ఈవార్తలు): కొడిమ్యాల మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీజేపీకి విదేశీ నిధులు

దేశంలో అశాంతికి కుట్ర.. కేంద్రం సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ: దేశంలో అశాంతిని రెచ్చగొట్టేందుకు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ), దాని కీలక సభ్యులు విదేశీ లాభాపేక్ష లేని సంస్థలు, శత్రు నెట్‌వర్క్‌ల నుంచి అక్రమంగా నిధులు పొందుతున్నారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలతో దేశ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన జితేంద్ర సింగ్, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, వ్యూహకర్త అశుతోష్ రాంకాలకు విదేశీ నిధులు అందించే సంస్థలతో సంబంధాలున్నాయని చెప్పడానికి తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. "వారికి అనధికారిక మార్గాల ద్వారా, దేశ వ్యతిరేక ఎన్జీఓల నుంచి, దేశంలో, విదేశాల్లో ఉన్న భారత వ్యతిరేక సంస్థల నుంచి నిధులు అందుతున్నాయని చెప్పడానికి తగిన ఆధారాలున్నాయి. అభిజీత్ దీప్కేకు అమెరికాకు చెందిన దాతల నుంచి, అశుతోష్ రాంకాకు పాకిస్థానీ రాజకీయ నాయకుల నుంచి డబ్బు అందుతోంది" అని సింగ్ వివరించారు. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ బీజేపీ అధికార ప్రతినిధి తుహిన్ ఎ సిన్హా కూడా సీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. పండుగల సీజన్‌లో దేశ రాజధానిలో గందరగోళం సృష్టించేందుకే సీజేపీ ఇటీవలి నిరసనలను చేపట్టిందని ఆయన ఆరోపించారు. 'ఎన్డీటీవీ'తో మాట్లాడుతూ.. "గత నెల రోజులుగా సీజేపీ ఎత్తుగడలన్నీ తిరుగుబాటును సృష్టించడానికే. పండుగ సమయంలో దేశ రాజధానిలో అరాచకాన్ని సృష్టించడమే వారి దురుద్దేశం" అని అన్నారు. సీజేపీ, కాంగ్రెస్ పార్టీ రెండూ న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకున్నాయని, రాహుల్ గాంధీ సుప్రీంకోర్టుకు వెళ్లడం వంటి చర్యలు దీనికి నిదర్శనమని సిన్హా పేర్కొన్నారు. ఈ రాజకీయ ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్.. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఈరోజు విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. నిషేధాజ్ఞలను ఉల్లంఘించడం, అనుమతి లేకుండా జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడం, ఇతరుల ఆస్తిలోకి అతిక్రమించి వెళ్లడం వంటి ఆరోపణలపై వారిని ప్రశ్నించనున్నారు. అక్టోబర్ 10న సౌరవ్ దాస్, రాంకాలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతికి భంగం కలిగించబోమని రూ. 50,000 శాంతి బాండ్‌పై సంతకం చేశాక వారిని విడుదల చేశారు. అయితే, కేవలం 72 గంటల్లోనే, అక్టోబర్ 13న వారు పోలీసు బారికేడ్లను దాటి జంతర్ మంతర్‌లోకి ప్రవేశించి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. మరోవైపు, ప్రతిపక్షాలు కేంద్రం చేస్తున్న 'విదేశీ హస్తం' ఆరోపణలను తీవ్రంగా ఖండించాయి. కర్ణాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్, ఐబీ, రా వంటి సంస్థలు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వారి అసమర్థతను చూపిస్తోందని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్‌కు విదేశీ సంస్థల నుంచి నిధులు వస్తున్నాయని బీజేపీ చెబుతోంది, కానీ ఒక్క ఆధారం కూడా చూపలేకపోతోంది. ఐబీ, రా ఏం చేస్తున్నాయి? ఏ ప్రాతిపదికన ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌కు మద్దతు తెలిపిన ఖర్గే, కాంగ్రెస్, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నిధులపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆధ్వర్యంలో చర్చ జరగాలని సూచించారు.

అమెరికా డీల్‌పై ఆచితూచి..!

వాణిజ్య ఒప్పందంపై భారత్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలన్న భారత్ తొందర తగ్గిందని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తాజా నివేదిక వెల్లడించింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు కాంగ్రెస్‌పై పూర్తి ఆధిపత్యం కోల్పోవడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కొంత తగ్గిందని విశ్లేషించింది. దీంతో భారత్‌పై సుంకాల విషయంలో ఆకస్మిక ఒత్తిళ్లు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలమని తెలిపింది. అమెరికా గతంలో ప్రకటించిన 18 శాతం సుంకాల విధానం అమల్లోకి రాలేదు. ప్రస్తుతం భారత వస్తువులపై 10 శాతం సెక్షన్ 301 సుంకం మాత్రమే అమలవుతోందని నివేదిక వివరించింది. అంతేకాకుండా, అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) ద్వారా ట్రంప్‌కు ఉన్న ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం కూడా తగ్గిందని పేర్కొంది. ఇకపై అదనపు సుంకాలు విధించాలంటే సెక్షన్ 301, 232 కింద విచారణలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో భారత్‌కు అకస్మాత్తుగా సుంకాల షాక్ తగిలే ప్రమాదం తగ్గుతుందని అంచనా వేసింది. అయితే వాణిజ్య రంగంలో అనిశ్చితి పూర్తిగా తొలగిపోలేదని నివేదిక హెచ్చరించింది. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాలపై సెక్షన్ 232 కింద అదనపు సుంకాలు విధించే ప్రమాదం ఉందని పేర్కొంది. రష్యా, ఇరాన్‌తో దౌత్య సంబంధాల్లో ప్రతికూల పరిణామాలు ఎదురైతే.. భారత్ చమురు దిగుమతులపై మళ్లీ ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 2028 ఎన్నికలకు ముందు వినియోగదారులకు ధరల ఉపశమనం కల్పించాల్సిన రాజకీయ అవసరం ట్రంప్‌పై ఉంటుందని విశ్లేషించింది. మరోవైపు అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం భారత్‌కు ఊరటనిస్తోంది. అక్టోబర్ 2026లో నమోదైన గరిష్ఠ స్థాయిలతో పోలిస్తే బ్రెంట్ క్రూడ్ ధర 19 శాతం తగ్గి బ్యారెల్‌కు 95 డాలర్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భారత్ చమురు దిగుమతుల బిల్లు 24 శాతం పెరిగింది.

ఇష్టముంటే రిజైన్ చేయండి

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్న వేళ.. మరో కొత్త పరిణామం చోటుచేసుకుంటోంది. ఉద్యోగులను నేరుగా తొలగించకుండా స్వచ్ఛందంగా సంస్థ నుంచి వైదొలిగే అవకాశాన్ని కల్పిస్తున్నాయి దిగ్గజ కంపెనీలు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్ ఈ విధానాన్ని అనుసరిస్తుండగా.. తాజాగా ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా కూడా ఆ జాబితాలో చేరినట్లు సమాచారం. ఫ్రాన్స్‌లోని తమ ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ పథకాన్ని మెటా ప్రతిపాదించినట్లు ఫ్రెంచ్ మీడియా సంస్థ 'లా లెటర్' వెల్లడించింది. ఫ్రాన్స్‌లో మెటాకు ప్రస్తుతం సుమారు 300 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ పథకం అమలైతే దాదాపు 100 మంది వరకు సంస్థను వీడే అవకాశం ఉందని కథనం పేర్కొంది. అయితే ఏ విభాగాల్లోని ఉద్యోగులపై ప్రభావం పడుతుందన్నది ఇంకా స్పష్టత రాలేదు. మైక్రోసాఫ్ట్, గూగుల్ పథకాలకు భిన్నంగా మెటా ప్రతిపాదన ఉందని సమాచారం. ఫ్రాన్స్‌లోని కార్మిక చట్టాల ప్రకారం 'కలెక్టివ్ కాంట్రాక్చువల్ టెర్మినేషన్' (ఆర్‌సీసీ) విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనుంది. ఇందులో భాగంగా కంపెనీ, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరిపి పరస్పర అంగీకారంతో ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకుంటారు. ఈ పథకంలో చేరాలనుకునే ఉద్యోగులు నవంబర్ 5లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని నివేదిక తెలిపింది. ఈ పథకం కింద ఉద్యోగులకు ఆకర్షణీయమైన పరిహారం అందించే ప్రతిపాదనను మెటా ముందుకు తెచ్చినట్లు సమాచారం. ఉద్యోగి సంస్థలో పనిచేసిన ప్రతి ఏడాదికి 2.15 నెలల వేతనానికి సమానమైన మొత్తాన్ని చెల్లించనుంది. దీంతోపాటు పది నెలల పాటు మొబిలిటీ లీవ్ కల్పించి.. ఆ సమయంలో స్థూల వేతనంలో 80 శాతం చెల్లించేలా ప్రతిపాదించినట్లు కథనం పేర్కొంది. ఉద్యోగులకు వృత్తిపరమైన నైపుణ్యాల శిక్షణ, సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు కూడా సహకారం అందించే అంశాన్ని మెటా పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

యువత తల్లిదండ్రులే టార్గెట్

దేశంపై వ్యతిరేకత పెంచే చర్యలు

పంథా మార్చిన ఉగ్రవాదులు

దక్షిణాదిన మరింత ప్రమాదం

దేశంలో హోం రాడికలైజేషన్



దేశ భద్రతా ఏజెన్సీలకు, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, 'అదృశ్య రాడికలైజేషన్' పెను సవాలుగా మారింది. ఐసిస్, అల్-ఖైదా వంటి ఉగ్రవాద సంస్థలు తమ కార్యకలాపాల స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాయి. క్షేత్రస్థాయి దాడుల కన్నా రాడికలైజేషన్ పైనే ఎక్కువగా ఆధారపడుతూ, ఇప్పుడు 'హోం రాడికలైజేషన్' అనే కొత్త, అత్యంత ప్రమాదకరమైన పంథాను ఎంచుకున్నాయి.

ఈ పరిణామం ఇంటెలిజెన్స్ బ్యూరో, జాతీయ దర్యాప్తు సంస్థ సహా స్థానిక పోలీసు బలగాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో ఆన్‌లైన్ ద్వారా యువతను ఆకర్షించిన ఉగ్రసంస్థలు, ఇప్పుడు భద్రతా ఏజెన్సీల నిఘాను తప్పించుకోవడానికి కొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. కళాశాల విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుంటున్నాయి.

న్యూఢిల్లీ: విదేశాల్లో ఉన్న ఉగ్రవాద హ్యాండ్లర్లు నేరుగా యువతను కాకుండా వారి తల్లిదండ్రులను లేదా దగ్గరి బంధువులను సంప్రదిస్తున్నారు. తమ హింసాత్మక సిద్ధాంతాలను వారి పిల్లల నరనరాల్లోకి ఎక్కించేలా వారిని ప్రేరేపిస్తున్నారు. ఈ పద్ధతినే అధికారులు 'హోం రాడికలైజేషన్'గా పేర్కొంటున్నారు. ఈ వ్యూహం చాలా ప్రభావవంతంగా, తక్కువ నష్టంతో కూడుకున్నదని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా తల్లిదండ్రులు, బంధువులపై భద్రతా ఏజెన్సీలకు అనుమానం వచ్చే అవకాశాలు చాలా తక్కువ. ఇదే ఉగ్రసంస్థలకు కలిసొస్తోంది. మరోవైపు, బయటి వ్యక్తి చెప్పేకంటే తల్లిదండ్రులు లేదా దగ్గరి బంధువులు చెప్పేదాన్ని పిల్లలు గుడ్డిగా నమ్ముతారు. దీంతో రాడికలైజేషన్ విజయవంతం అయ్యే అవకాశాలు వంద శాతం ఉంటున్నాయి. పిల్లలు తమ తల్లిదండ్రులు చెప్పేదాన్ని గుడ్డిగా నమ్ముతారని, అదే నిజమని భావిస్తారని, ఇది వారిని అత్యంత ప్రమాదకారులుగా మారుస్తోందని ఒక ఉన్నతాధికారి వివరించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు ఈ రకమైన రాడికలైజేషన్‌కు కేంద్రాలుగా మారుతున్నాయి. దాడులు చేయడం కన్నా హింసాత్మక సిద్ధాంతాన్ని రహస్యంగా ప్రచారం చేయడం, రాజకీయ వ్యవస్థలో భాగమవడం, సమాజంలో చట్టబద్ధతను పెంచుకోవడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలతో ఉగ్రసంస్థలు పనిచేస్తున్నాయి. ఇటీవల కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఒక సంఘటన ఈ ప్రమాదాన్ని కళ్లకు కట్టింది. ఏళ్ల బాలుడిని ఐసిస్‌లో చేరమని ప్రోత్సహిస్తున్న అతని తల్లి, సవతి తండ్రిపై పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు నవంబర్ 2025లో నమోదైంది. బయటి వ్యక్తుల ద్వారా రాడికలైజ్ అయిన వారిని గుర్తించి, కౌన్సిలింగ్ ఇచ్చి మార్చడం ఏజెన్సీలకు సులభం. కానీ, సొంత తల్లిదండ్రుల ద్వారానే ఉగ్రవాద భావజాలం వైపు మళ్లిన యువతను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం 'హెర్కులియన్ టాస్క్' (శక్తికి మించిన పని) అని, ఇది భద్రతా వ్యవస్థకు పెను సవాల్ అని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వందేభారత్‌కు ఫుల్ డిమాండ్

స్లీపర్ బెర్తులకు మస్తు గిరాకీ

న్యూఢిల్లీ: దేశంలో ప్రవేశపెట్టిన సెమీ-హై-స్పీడ్ రైళ్లు వందే భారత్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ రైళ్ల ఆక్యుపెన్సీ గణాంకాలు వాటి విజయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, తిరువనంతపురం సెంట్రల్-మంగళూరు సెంట్రల్ మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఏకంగా 189.35% ఆక్యుపెన్సీతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించింది. రైల్వే బోర్డు అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం, దేశవ్యాప్తంగా నడుస్తున్న అన్ని వందే భారత్ చైర్ కార్ సర్వీసుల్లో కలిపి సగటు ఆక్యుపెన్సీ 99.10%గా నమోదైంది. జనవరి 2026లో ప్రారంభమైన తొలి వందే భారత్ స్లీపర్ రైలు (హౌరా-కామాఖ్య) కూడా ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ రైలులో ఏకంగా 114.54% ఆక్యుపెన్సీ నమోదైనట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో పేర్కొంది. ఆక్యుపెన్సీలో రికార్డు సృష్టించిన తిరువనంతపురం-మంగళూరు రూట్‌లో, తిరువనంతపురం నుంచి మంగళూరు వెళ్లే రైలు (20632) 189.35% ఆక్యుపెన్సీ నమోదు చేయగా, మంగళూరు నుంచి తిరువనంతపురం వచ్చే రైలు (20631) 174.77% ఆక్యుపెన్సీ సాధించింది. 100% కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉండటం అంటే, అందుబాటులో ఉన్న సీట్ల కంటే ఎక్కువ మంది ప్రయాణికులు వెయిటింగ్ లిస్ట్‌లో ఉండి ప్రయాణించడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం. ఇది ఈ రూట్లలో డిమాండ్ ఏ స్థాయిలో ఉందో సూచిస్తోంది. అదేవిధంగా, ఢిల్లీ-వారణాసి మధ్య నడిచే రెండు జతల వందే భారత్ చైర్ కార్ సర్వీసులు కూడా 114% నుంచి 117% పైగా ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. వందే భారత్ రైళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ మరిన్ని స్లీపర్ సర్వీసులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. కర్ణాటకకు రెండో వందే భారత్ స్లీపర్ రైలును కేటాయించినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల ప్రకటించారు. ఈ రైలు బెంగళూరు నుంచి హుబ్బళ్లి మీదుగా ముంబై వరకు నడవనుంది. దీనివల్ల ఉత్తర కర్ణాటక, పుణె, ముంబై నగరాల మధ్య ప్రయాణం సులభతరం కానుంది. కాగా, ఢిల్లీ-వారణాసి మార్గంలో అక్టోబర్ 31, 2026న ఒక వందే భారత్ స్లీపర్ రైలును ఇప్పటికే ప్రారంభించారు. 2019లో ప్రారంభమైన వందే భారత్ సేవలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 160కి పైగా సర్వీసులకు విస్తరించాయి. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో ఈ ఆధునిక రైళ్లను తయారు చేస్తున్నారు.

చిలుక ఆచూకీ చెప్తే రూ.లక్ష రివార్డు

వడోదర: వడోదరలో ఓ కుటుంబం తమ ఇంట్లో పెంచుకుంటున్న చిలుక కోసం తీవ్రంగా ఆందోళన చెందుతోంది. బిడ్డలా చూసుకుంటున్న 'లడ్డూ' అనే ఆరు నెలల ఆఫ్రికన్ గ్రే జాతి చిలుక కనిపించకుండా పోవడంతో, దానిని వెతికి పట్టుకొచ్చిన వారికి ఏకంగా రూ.1 లక్ష బహుమతిగా ఇస్తామని ప్రకటించింది. పారిఖ్ కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం, అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో లడ్డూ, తన పంజరం తలుపును అదే తెరుచుకుని బయటకు ఎగిరిపోయింది. అప్పటి నుంచి దాని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. పుణేలోని ఓ బ్రీడర్ నుంచి తెచ్చుకున్న ఈ చిలుకకు దానంతట అదే ఆహారం తినడం రాదని, అందుకే తాము మరింత ఆందోళన చెందుతున్నామని దానిని పెంచుకుంటున్న జెస్సికా పారిఖ్ తెలిపారు. లడ్డూ కోసం సేవాని, గోత్రి, భయ్లీ వంటి ప్రాంతాల్లో వెతికారు. తమ వాయిస్‌ను రికార్డ్ చేసి ప్లే చేయడం, ఈలలు వేయడం వంటి ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. దాని కాలికి లైసెన్స్ నంబర్‌తో కూడిన రింగ్ ఉందని, బహుశా అది ఏదైనా నిర్మానుష్య ప్రదేశంలో లేదా నది సమీపంలో ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఆఫ్రికన్ గ్రే జాతి చిలుకలు తమ యజమానులతో చాలా బలమైన బంధాన్ని ఏర్పరుచుకుంటాయని చెబుతారు. ఇప్పుడు తమ లడ్డూ తిరిగి రావాలని ఆ కుటుంబం ఆశగా ఎదురుచూస్తోంది.



ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ విజేత.. భారత్

భారత పురుషుల హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను ఆరోసారి సొంతం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 4--1 గోల్స్ తేడాతో జపాన్ జట్టును ఓడించింది. 2011, 2016, 2018, 2023, 2024లలో కూడా భారత జట్టు విజేతగా నిలిచింది.

మదుపర్లకు

రూ.8 లక్షల కోట్ల లాభం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు అనుకూలంగా మారడం, భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న ఆశలు, విదేశీ మదుపర్ల కొనుగోళ్లు, కంపెనీల త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలు మార్కెట్లకు ఊపునిచ్చాయి. బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఆర్థిక సేవలు, రియల్టీ రంగాల షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సూచీలు దూసుకెళ్లాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 2,008.61 పాయింట్లు (2.60 శాతం) లాభపడి 79,310.01 వద్ద ముగిసింది. ఉదయం 78,910.94 వద్ద ప్రారంభమైన సూచీ.. ఓ దశలో 79,470.03 గరిష్ఠ స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 576 పాయింట్లు (2.40 శాతం) పెరిగి 24,536.60 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,579.90 గరిష్ఠాన్ని నమోదు చేసింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఏకంగా రూ.8 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. సెన్సెక్స్‌లోని ప్రధాన షేర్లలో బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా 7.77 శాతం లాభపడింది. ఇండిగో 5.80 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 5.29 శాతం, మారుతి సుజుకి 5.28 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 5.15 శాతం చొప్పున పెరిగాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లూ లాభాల్లో ముగిశాయి. అయితే ఎటర్నల్ 1.65 శాతం నష్టపోయి సెన్సెక్స్‌లో అత్యధికంగా పడిపోయిన షేర్‌గా నిలిచింది. భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ పోర్ట్స్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, భారతి ఎయిర్‌టెల్ స్వల్ప నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎక్స్-బ్యాంక్ 4.24 శాతం, నిఫ్టీ ఆటో 4.14 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 25/50 సూచీ 3.97 శాతం, నిఫ్టీ రియల్టీ 3.52 శాతం చొప్పున లాభపడ్డాయి. ప్రైవేట్ బ్యాంక్, ప్రభుత్వ రంగ బ్యాంక్, ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలూ పెరిగాయి. నిఫ్టీ మీడియా 0.84 శాతం, కెమికల్స్ 0.63 శాతం నష్టపోయాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విషయంలో మరింత సంయమనంతో వ్యవహరించవచ్చన్న అంచనాలు మదుపర్లలో ఆశలు పెంచాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న సంకేతాలతో ముడిచమురు ధరలు దిగొచ్చాయి.



బ్లింకిట్ అంబులెన్స్

బుకింగ్‌లో కొత్త రూల్

అత్యవసరం కాని ప్రయాణానికి రూ.2,500!

న్యూఢిల్లీ: క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ తన అంబులెన్స్ సేవల్లో కీలక మార్పు చేసింది. అత్యవసర వైద్య పరిస్థితుల్లో రోగులను తరలించేందుకు అందించే అంబులెన్స్ సేవలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రకటించింది. అయితే అత్యవసరం కాని ప్రయాణాలకు ఇకపై రూ.2,500 ఫ్లాట్ ఫీజు వసూలు చేయనుంది. అంబులెన్స్‌లు సాధారణ అవసరాలకు కాకుండా.. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నవారికి అందుబాటులో ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఎటర్నల్ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ గురువారం ఈ మార్పును ప్రకటించారు. డాక్టర్ సంప్రదింపులు, సాధారణ వైద్య పరీక్షలు, ఆసుపత్రికి వెళ్లడం, ఆసుపత్రి నుంచి ఇంటికి రావడం వంటి అత్యవసరం కాని అవసరాలకు కూడా అంబులెన్స్‌లను వినియోగిస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రయాణాలకు సాధారణ వాహనాలు లేదా ప్రైవేటు రవాణా సేవలను ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. గత రెండేళ్లలో బ్లింకిట్ అంబులెన్స్ సేవల ద్వారా మొత్తం 42 వేల కేసులకు స్పందించామని గోయల్ వెల్లడించారు. వీటిలో దాదాపు 20 వేల అత్యవసర కేసులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు ఏ ఒక్కరి నుంచీ ఎలాంటి ఛార్జీ వసూలు చేయలేదని, అత్యవసర సేవలను భవిష్యత్తులోనూ ఉచితంగానే కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అయితే, రోగులకు సంబంధించి అన్ని రకాల ప్రయాణాలకు ఉచిత సేవ అందుబాటులో ఉండటంతో సాధారణ అవసరాల కోసం అంబులెన్స్ బుకింగ్‌లు పెరుగుతున్నాయని సంస్థ గుర్తించింది.



ప్రియురాలి చిత్రం



వైభవంగా సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థం

మెగా కుటుంబంలో మరో శుభకార్యం జరిగింది. నటుడు సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థం గురువారంనవంబర్ 5, 2026.. హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని హిల్టన్ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో ఈ వేడుకను నిర్వహించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఈ జంట కొత్త జీవితానికి తొలి అడుగు వేసింది. సాయి దుర్గ తేజ్, కిరణ్ నిశ్చితార్థ వేడుకకు కొణిదెల, అల్లు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయి దుర్గ తేజ్ తల్లిదండ్రులు డాక్టర్ శివప్రసాద్, విజయదుర్గ, సోదరుడు వైష్ణవ్ తేజ్ ఈ వేడుకలో పాల్గొన్నారు. మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కొణిదెల, రామ్ చరణ్ కూడా హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఇక ఈ అమ్మాయి గురించి సోషల్ మీడియాలో తెగ సెర్చ్ చేస్తున్నారు. కాగా ఈ అమ్మాయి పూర్తి పేరు కిరణ్మయి అని తెలుస్తోంది. సాయి దుర్గ కేష్ కి ఎన్నో రోజుల నుంచి స్నేహితురాలు అని.. స్నేహమే ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లికి దారి తీసినట్లు తెలుస్తోంది. ఇక అల్లు అర్జున్ తన భార్య స్నేహారెడ్డితో కలిసి ఈ వేడుకకు వచ్చారు. అల్లు బాబీ, నీలా షా, వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి, వారి కుమారుడు వాయువ తేజ్ కూడా నిశ్చితార్థంలో సందడి చేశారు. నాగబాబు, పద్మజ, నిహారిక కొణిదెల, అల్లు అరవింద్, అల్లు నిర్మల, అల్లు శిరీష్, నయనికా రెడ్డి కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అకీరా నందన్, ఆద్య కూడా ఈ కుటుంబ వేడుకకు హాజరయ్యారు. సాయి దుర్గ తేజ్ నిశ్చితార్థానికి కుటుంబ సభ్యులతో పాటు పలువురు స్నేహితులు, సినీ ప్రముఖులు కూడా వచ్చారు. మంచు మనోజ్, భూమా మౌనిక రెడ్డి, నవీన్ విజయకృష్ణ, హర్ష చెముడు, వెంకీ కుడుముల, నవదీప్, హర్షిత్ రెడ్డి ఈ వేడుకలో పాల్గొన్నారు. ఇక సాయి దుర్గ తేజ్, కిరణ్ వివాహం డిసెంబర్ 10, 2026న హైదరాబాద్‌లో జరగనుంది.

శ్రీవారికి డ్రమ్స్ శివమణి కంప్లెయింట్

ప్రముఖ డ్రమ్స్ కళాకారుడు శివమణి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సాధారణంగా సెలబ్రిటీలు తిరుమలకు వచ్చినప్పుడు తమ సినిమాలు, వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడుతుంటారు. కానీ శివమణి మాత్రం ఓ మ్యూజిక్ డైరెక్టర్‌పై స్వామివారికే కంప్లైంట్ ఇచ్చానని చెప్పడం



ఆశ్చర్యం కలిగించింది. హైదరాబాద్‌కు చెందిన ఓ సంగీత దర్శకుడు మూడేళ్లుగా మ్యూజిషియన్లకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఆయన ఆరోపించారు. తిరుమలలో మీడియాతో మాట్లాడిన శివమణి, సంగీత కళాకారుల కష్టాన్ని ప్రస్తావించారు. ఒక పాట కోసం ఎంతోమంది మ్యూజిషియన్లు పనిచేస్తారని, వాళ్లకు రావాల్సిన పారితోషికం నిలిపివేయడం సరికాదని అన్నారు. మూడేళ్లుగా బాకీలు చెల్లించని సదరు మ్యూజిక్ డైరెక్టర్ నుంచి డబ్బులు ఇప్పించాలని వెంకటేశ్వరస్వామిని కోరుకున్నట్లు చెప్పారు. అయితే ఆ సంగీత దర్శకుడి పేరును మాత్రం బయటపెట్టలేదు. నార్మల్ గా ఒక పాట హిట్టయితే ఎక్కువగా సంగీత దర్శకుడికే పేరు వస్తుంది. కానీ దాని వెనుక వాయిద్య కళాకారులు, ఇతర టెక్నీషియన్ల కష్టం కూడా ఉంటుంది. అలాంటి వాళ్లకు మూడేళ్లుగా డబ్బులు అందలేదని శివమణి స్థాయి కళాకారుడు చెప్పడం హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు శివమణి ప్రస్తుతం 'కర్మ బర్న్' పేరుతో ప్రత్యేకమైన మ్యూజిక్ కాన్సర్ట్‌లు నిర్వహిస్తున్నారు. వీటిలో కేవలం భక్తి గీతాలనే ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మూడు షోలు పూర్తి చేశామని, త్వరలో అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వబోతున్నామని చెప్పారు. కార్తీక మాసం సందర్భంగా అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు వివరించారు.

నా ముఖం నాకే నచ్చదు



నా రూపం నాకే నచ్చేది కాదు అంటూ షాకింగ్ విషయాలు పంచుకుంది టాలీవుడ్ హీరోయిన్ పూజా హెగ్డే. తాజాగా ఓ బ్రాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఈమె తన చిన్ననాటి విషయాలు పంచుకుంటూ.. 'నేను చాలా చిన్న వయసులో ఉన్నప్పుడు నా రూపానికి సంబంధించి ఎన్నో విషయాలు నాకు నచ్చేవి కాదు. నా ఫేస్‌లో ముక్కు నచ్చేది కాదు. వాటిని చూసుకుని బాధపడేదాన్ని. ముఖ్యంగా నా నవ్వు అస్సలు ఇష్టం ఉండేది కాదు. అయితే.. ఒకసారి ఈ విషయాన్ని మా నాన్న దగ్గర చెప్పుకుని బాధపడ్డాను. అప్పుడు మా నాన్న 'దేవుడు నీ ముఖానికి ఏ ముక్కు సరిపోతుందో దాన్నే ఇచ్చాడు. ఒకవేళ పెద్ద ముక్కు నీ ముఖంపై ఉంటే ఎలా ఉంటుందో ఊహించుకో' అని చెప్పారు. ఆ మాటతో నాకు నా ఫీచర్స్ పట్ల అవగాహన వచ్చింది. అయితే మనం మన గురించి ఆలోచించేటప్పుడు చాలా సున్నితంగా, నెగిటివ్‌గా ఆలోచిస్తాము. అది బాలేదు, ఇది బాలేదు అని మనల్ని మనమే తక్కువ చేసుకుంటాం. అది అస్సలు మంచి విషయం కాదు' అని చెప్పుకొచ్చింది. అలాగే.. ఒకప్పుడు తాను అసహ్యించుకున్న ముక్కు, నవ్వులనే ఈరోజు ప్రేక్షకులు ఎంతో ఇష్టపడుతున్నారని, అందుకే మనల్ని మనం ప్రేమించుకోవడం ముఖ్యమని పూజా చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



లెక్క తప్పిన కీర్తి సురేష్!



కీర్తి సురేష్‌కు తెలుగుతో పాటు తమిళంలోనూ మంచి గుర్తింపు ఉంది. 'మహానటి'తో జాతీయ అవార్డు అందుకున్న ఆమె, హిందీలోనూ సత్తా చాటాలని చూస్తోంది. కానీ అక్కడ మాత్రం పరిస్థితులు అనుకున్నట్లు కలిసి రావడం లేదు. వరుణ్ ధావన్‌తో చేసిన 'బేబీ జాన్' నిరాశపరచగా, ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన 'అక్క' కూడా మిక్స్‌డ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. దీంతో బాలీవుడ్‌లో కీర్తికి సరైన బ్రేక్ ఇంకా దక్కలేదనే చెప్పాలి. 2024లో విడుదలైన 'బేబీ జాన్'తో కీర్తి హిందీ సినిమాల్లోకి అడుగుపెట్టారు. తమిళంలో విజయ్ నటించిన 'తెరి'కి రీమేక్‌గా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ పరాజయం అందుకుంది. వరుణ్ ధావన్ లాంటి హీరో పక్కన నటించినా ఆ విజయం కీర్తికి ఉపయోగపడలేదు. దీంతో హిందీలో తొలి సినిమాతోనే మంచి మార్కెట్ సంపాదించుకోవాలనే అవకాశం చేజారింది. నిజానికి 'అక్క'నే తన మొదటి హిందీ ప్రాజెక్ట్‌గా విడుదల చేయాలని కీర్తి భావించారట. ఈ సిరీస్ కథ నచ్చడంతో ఇతర ప్రాజెక్టులకంటే ముందే ఒప్పుకున్నారు. కానీ నిర్మాణం, విడుదల ఆలస్యం కావడంతో 'బేబీ జాన్' ముందుగా ప్రేక్షకుల దగ్గరకు వచ్చింది. లేటెస్ట్ గా ఈ విషయాన్ని ప్రమోషన్లలో కీర్తి స్వయంగా వెల్లడించారు. ఇక 'అక్క'లో మాత్రం పూర్తిగా భిన్నమైన పాత్ర. ఎనభై దశకంలో మహిళల ఆధిపత్యంలో నడిచే ప్రాంతానికి నాయకురాలైన భవానిగా కనిపించారు. రాధికా ఆప్టేతో పోటీపడే పాత్రలో కీర్తి నటనకు మంచి ప్రశంసలు వచ్చాయి. ముఖ్యంగా ఆమె స్క్రీన్ ప్రెజెన్స్‌ను మెచ్చుకున్నారు.

ఎముకలు కొరికే చలిలో జాన్వీ గజగజ

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ప్రొఫెషనల్ లైఫ్‌లో క్షణం తీరిక లేకుండా గడుపుతుంటారు. వరుస సినిమాలతో దూసుకుపోతున్న బ్యూటీ తాజాగా ఓ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ నిమిత్తం మంచు ప్రాంతానికి వెళ్లారు. హిమాలయాల అందాల మధ్య సాగుతున్న ఈ షూటింగ్‌కు సంబంధించి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అమ్మడు కొన్ని ఆసక్తికరమైన ఫోటోలను, విశేషాలను అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఎముకలు కొరికే చలిలో షూటింగ్ జరుపు కుంటున్నట్లు జాన్వీ తెలిపారు. చలి తీవ్రతకు శరీరం మొద్దుబారిపోతున్నా? ఆ షూటింగ్ మధుర జ్ఞాపకాలు మాత్రం మనసును వెచ్చదగతో నింపుతున్నాయని పేర్కొన్నారు. ఈ వాతావరణం ఎంత కఠినంగా ఉన్నా? చేసే పనిపై ఉన్న మమకారం ఆ ఇబ్బందిని మరిచిపోయేలా చేస్తోందని వెల్లడించారు. అలాగే పోస్ట్‌లో జాన్వీ తనదైన శైలిలో సరదాగా స్పందించారు. -ఎవరైనా నన్ను గట్టిగా చిటికె వేసి ఇది నిజమో కాదో తేల్చండి. ఎందుకంటే చలికి నా ఒళ్లంతా మొద్దుబారిపోయింది. కానీ మేం షూట్ చేసిన విధానం మాత్రం నా మనసుకు ఎంతో హాయిని.. వెచ్చదనాన్ని ఇస్తోంది- అంటూ క్యాప్షన్ జోడించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. చిత్రీకరణ జరుగుతున్న ప్రాంతం పేరైతే జాన్వీ గోప్యంగా ఉంచినా? బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపిస్తున్న మంచుతో నిండిన కొండలు, హిమాలయ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు ప్రదేశంపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. చెట్లు లేని ఎత్తైన మంచు పర్వతాలు, శీతల వాతావరణం ఈ ప్రాజెక్ట్ విజువల్స్ ఏ స్థాయిలో ఉండబోతున్నాయో చెప్పకనే చెబుతున్నాయి.

ఉత్తరాది.. దక్షిణాది విభజన సరికాదు



'పెద్ది' సినిమాలో గ్లామర్ రోల్‌లో నటించడంపై జాన్వీ కపూర్ చేసిన కామెంట్స్‌తో పాటు, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాధికా ఆప్టే కూడా బాలకృష్ణ సినిమాలో నటించడంపై విమర్శలు చేశారు. తెలుగు సినిమాపై ఈ ఇద్దరు హీరోయిన్స్ చేసిన వ్యాఖ్యల ప్రజెంట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ నేపథ్యంలో రెజీనా కసాండ్రా నార్త్-సౌత్ విభజనపై తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 'కేసరి చాప్టర్ 2'లో అక్షయ్ కుమార్ భార్యగా కీలక పాత్ర పోషించినప్పటికీ, ధర్మ ప్రొడక్షన్స్ తనను సినిమా ప్రమోషన్లకు దూరంగా ఉంచిందని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ సంచలన ఆరోపణలు చేసింది. 'నార్త్ ఇండియన్ నటులు సౌత్ ఇండియన్ సినిమా గురించి మాట్లాడేటప్పుడు.. నార్త్-సౌత్ విభజనను సృష్టించేలా మాట్లాడటం అస్సలు కరెక్ట్ కాదు. ఆ మాటకు వస్తే.. నేను నటించిన ధర్మ ప్రొడక్షన్స్ సినిమాకు చెందిన కరణ్ జోహర్.. ఆ సినిమాలో నాకు ప్రముఖ పాత్ర ఉన్నప్పటికీ నన్ను ప్రమోట్ చేయకూడదని నిర్ణయించుకున్నారు. ఎలాంటి వివరణ లేకుండానే ప్రమోషన్ల నుంచి నా పేరును తొలగించారు. నేను కనిపించే పాటను విడుదల చేశారు.. కానీ కనీసం నన్ను ట్యాగ్ కూడా చేయలేదు. దీనిని నేనేం అనాలి? అంటే నేను సౌత్ ఇండియన్ నటిని కావడం వల్ల నార్త్‌తో అలా చేశారా?'అంటూ ప్రశ్నించింది. అంతే కాకుండా.. మీపై ఎవరూ అత్యాచారం చేయడం లేదు కదా!



రొనాల్డో రిటైర్మెంట్
23 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు

ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. పోర్చుగల్ జాతీయ జట్టు తరఫున తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించాడు. 23 ఏళ్ల పాటు సాగిన ప్రస్థానానికి వీడ్కోలు చెబుతూ సోషల్ మీడియాలో భావోద్వేగ వీడియోను పంచుకున్నాడు. పోర్చుగల్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా, అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్‌గా రికార్డులు సృష్టించిన 41 ఏళ్ల రొనాల్డో.. ఇకపై జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించడు.

తనకు ఎంతో ప్రత్యేకమైన 7వ నంబర్ జెర్సీని తర్వాతి తరం ఆటగాడికి అందించనున్నట్లు వెల్లడించాడు. "జాతీయ జట్టు తరఫున మైదానంలో నా ప్రయాణం నేటితో ముగుస్తోంది. నేను సాగించిన ప్రస్థానం పట్ల గర్వంగా ఉంది. పోర్చుగల్ కోసం నా శక్తినంతా ధారపోశాననే సంతృప్తితో వీడ్కోలు చెబుతున్నా" అని రొనాల్డో తన సందేశంలో పేర్కొన్నాడు.

అభిమానులు, కుటుంబ సభ్యులు, తనతో కలిసి ఆడిన సహచరులకు కృతజ్ఞతలు తెలిపాడు. 7వ నంబర్ జెర్సీ ఇక మరొకరి సొంతమైనా.. దానిని ధరించిన గర్వం తనకు ఎప్పటికీ ఉంటుందని చెప్పాడు. రొనాల్డో అంతర్జాతీయ కెరీర్ ముగింపు ప్రకటనకు ముందు పోర్చుగల్ జట్టులో పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి. ప్రధాన కోచ్ జార్జ్ జీసస్‌తో అతడికి విభేదాలు తలెత్తాయి. సెప్టెంబర్ 27న నార్వేతో జరిగిన నేషన్స్ లీగ్ మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో గెలిచినా.. రొనాల్డోకు ఒక్క నిమిషం కూడా ఆడే అవకాశం దక్కలేదు.

ఫిట్‌నెస్ నిర్వహణలో భాగంగా తనకు విశ్రాంతి ఇస్తారని తొలుత చెప్పారని, ఆ తర్వాత నార్వేతో మ్యాచ్‌లో సుమారు 30 నిమిషాలు ఆడిస్తానని కోచ్ హామీ ఇచ్చాడని రొనాల్డో వెల్లడించాడు. విరామ సమయంలో వార్మప్ చేసినా మైదానంలోకి దిగే అవకాశం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశాడు. మ్యాచ్ తర్వాత మీడియాకు పరిస్థితిని వివరిస్తానని కోచ్ తనతో అంగీకరించిన విషయానికి భిన్నంగా మాట్లాడాడని రొనాల్డో ఆరోపించాడు. అయితే జట్టును ఎంపిక చేసే బాధ్యత తనదేనని జీసస్ స్పష్టం చేశారు. ఈ వివాదం నేపథ్యంలో డెన్మార్క్‌తో మ్యాచ్‌కు ముందు కోపెన్‌హేగన్‌లోని జట్టు శిబిరం నుంచి రొనాల్డో వెళ్లిపోయాడు. దీనిపై పోర్చుగల్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. అనంతరం తన నిర్ణయం తప్పేనని అంగీకరించిన రొనాల్డో.. సహచర ఆటగాళ్లు, అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. ఈ ఘటనపై పోర్చుగల్ ఫుట్‌బాల్ సమాఖ్య అతడికి 30 రోజుల సస్పెన్షన్‌తో పాటు 255 యూరోల జరిమానా విధించింది. అయితే ఆ శిక్షను వెనక్కి తీసుకోవడంతో తర్వాతి



మ్యాచ్‌లకు అతడు అందుబాటులో ఉండే అవకాశం లభించింది. 2026 ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని గతంలో భావించిన రొనాల్డో.. సమాఖ్య అధ్యక్షుడు పెడ్రో ప్రోయెంకా సూచనతో ఆ నిర్ణయాన్ని పునరాలోచించినట్లు కథనంలో పేర్కొన్నారు. 2003 ఆగస్టులో కజకిస్థాన్‌తో మ్యాచ్ ద్వారా పోర్చుగల్ జట్టులోకి అడుగుపెట్టిన రొనాల్డో.. ఆ మరుసటి ఏడాదే యూరో 2004 ఫైనల్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో గ్రీస్ చేతిలో పోర్చుగల్ ఓడిపోయినా.. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. 2006 ప్రపంచకప్, 2012 యూరో కప్‌లలో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. 2016 యూరో కప్ ఫైనల్‌లో ఫ్రాన్స్‌తో తలపడిన సమయంలో గాయంతో తొలి అర్ధభాగంలోనే రొనాల్డో మైదానం వీడాడు. అయినప్పటికీ పక్కన నిలబడి సహచరులను ఉత్సాహపరిచాడు. అదనపు సమయంలో ఎడెర్ చేసిన గోల్‌తో పోర్చుగల్ తొలి యూరో కప్ టైటిల్‌ను అందుకుంది. 2019లో స్విట్జర్లాండ్‌పై సెమీఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించి నేషన్స్ లీగ్ తొలి టైటిల్ గెలవడంలోనూ రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2025లో స్పెయిన్‌తో ఫైనల్‌లోనూ గోల్ చేసి రెండోసారి నేషన్స్ లీగ్ విజేతగా నిలిచిన జట్టులో భాగమయ్యాడు. పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ చేసిన రొనాల్డో.. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఈ రెండు విభాగాల్లోనూ ప్రపంచ రికార్డులు నెలకొల్పాడు. 2026 ప్రపంచకప్‌లో ఆరు వేర్వేరు టోర్నీల్లో గోల్స్ చేసిన తొలి ఆటగాడిగా మరో ఘనత సాధించాడు. యూరో కప్ చరిత్రలో అత్యధికంగా 14 గోల్స్, 30 మ్యాచ్‌లు ఆడిన రికార్డులు కూడా అతడి పేరిటే ఉన్నాయి. రొనాల్డో కెరీర్‌లో ఎన్నో విజయాలు ఉన్నా.. ఫిఫా ప్రపంచకప్ మాత్రం అందని కలగానే మిగిలిపోయింది. 2006లో పోర్చుగల్ సెమీఫైనల్ చేరడమే అతడి కెరీర్‌లో ఆ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన. 2022లో మొరాకో చేతిలో క్వార్టర్ ఫైనల్లో ఓటమి, 2026లో స్పెయిన్ చేతిలో ప్రిక్వార్టర్ ఫైనల్లో పరాజయం అతడికి చేదు జ్ఞాపకాలుగా మిగిలాయి. అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికినా.. క్లబ్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో ప్రయాణం కొనసాగనుంది. అల్ నసర్ తరఫున ఆడుతున్న అతడు కెరీర్‌లో 1,000 గోల్స్ మైలురాయికి చేరువలో ఉన్నాడు. తాజా లెక్కల ప్రకారం అతడి మొత్తం గోల్స్ సంఖ్య 979. పోర్చుగల్ జట్టుకు 234 మ్యాచ్‌లు, 146 గోల్స్, ఒక యూరో కప్, రెండు నేషన్స్ లీగ్ టైటిళ్లు అందించిన రొనాల్డో వారసత్వాన్ని మరో ఆటగాడు భర్తీ చేయడం అంత సులభం కాదు.



విశాఖలో భారత్-శ్రీలంక తొలి వన్డే

ఆంధ్రప్రదేశ్‌లోని క్రికెట్ ప్రేమికులకు ఇది శుభవార్త. భారత్, శ్రీలంక మధ్య జరగాల్సిన తొలి వన్డే మ్యాచ్ వేదికను ఢిల్లీ నుంచి విశాఖపట్నానికి మారుస్తున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారికంగా ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 13న జరగాల్సిన ఈ మ్యాచ్ వేదికలో మాత్రమే మార్పు చేసినట్లు వెల్లడించింది. తేదీ యథాతథంగా ఉంటుందని స్పష్టం చేసింది. ఢిల్లీలో డిసెంబర్ నెలలో ఉండే ప్రతికూల వాతావరణ పరిస్థితులు, అలాగే స్టేడియంలో చేపట్టాల్సిన పునరుద్ధరణ పనులను దృష్టిలో ఉంచుకొని మ్యాచ్ వేదికను మార్చాలని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) బీసీసీఐకి విజ్ఞప్తి చేసింది. ఈ అభ్యర్థనను పరిశీలించిన బీసీసీఐ, తొలి వన్డేను విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియానికి తరలించాలని నిర్ణయించింది. దీంతో డిసెంబర్ 13న జరగనున్న తొలి వన్డేకు వైజాగ్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు భారత గడ్డపై మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొంటుంది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేశారు.

శ్రీలంక భారత పర్యటన 2026 - పూర్తి షెడ్యూల్

తొలి వన్డే: డిసెంబర్ 13, ఆదివారం (మధ్యాహ్నం 2:00) - విశాఖపట్నం
రెండో వన్డే: డిసెంబర్ 16, బుధవారం (మధ్యాహ్నం 2:00) - బెంగళూరు
మూడో వన్డే: డిసెంబర్ 19, శనివారం (మధ్యాహ్నం 2:00) - అహ్మదాబాద్

తొలి టీ20: డిసెంబర్ 22, మంగళవారం (రాత్రి 7:00) - రాజ్‌కోట్
రెండో టీ20: డిసెంబర్ 24, గురువారం (రాత్రి 7:00) - కటక్
మూడో టీ20: డిసెంబర్ 27, ఆదివారం (రాత్రి 7:00) - పుణె

సగం ధరకే చెన్నైకి
లివింగ్‌స్టోన్
సీఎస్‌కే, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య మెగా డీల్

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ట్రేడింగ్ విండోలో ఒక భారీ ఒప్పందం కుదిరింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఫ్రాంచైజీల మధ్య పలువురు కీలక ఆటగాళ్లు చేతులు మారారు. ఈ మెగా ట్రేడ్‌లో భాగంగా, ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి రాగా, భారత లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఖలీల్ అహ్మద్, ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ గూటికి చేరారు. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన అంశం లివింగ్‌స్టోన్ బదిలీ. గతంలో ఎస్‌ఆర్‌హెచ్ అతడిని రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు చెన్నై సగాని కన్నా తక్కువ ధరకు, అంటే కేవలం రూ.6 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో లివింగ్‌స్టోన్ కేవలం రెండు మ్యాచ్‌లే ఆడి 15 పరుగులే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక, గాయం కారణంగా గత సీజన్‌కు దూరమైన జాక్ ఎడ్వర్డ్స్‌ను సీఎస్‌కే అతని ప్రస్తుత ఫీజు రూ.3 కోట్లతో జట్టులోకి తీసుకుంది. ఈ ఇద్దరు ఓవర్సీస్ ఆల్‌రౌండర్ల చేరికతో చెన్నై జట్టు సమతూకం పెంచుకుంది. మరోవైపు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ పేస్ బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసుకుంది. గతంలో 2018 నుంచి 2021 వరకు ఎస్‌ఆర్‌హెచ్‌కే ప్రాతినిధ్యం వహించిన ఖలీల్ అహ్మద్, తన ప్రస్తుత ఫీజు రూ.4.8 కోట్లతో తిరిగి సొంత జట్టులోకి వచ్చాడు. ఐపీఎల్ 2025లో సీఎస్‌కే తరఫున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన ఖలీల్, 2026లో గాయం కారణంగా ఐదు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ఫీజుతో హైదరాబాద్ జట్టులోకి చేరాడు. అతను కూడా గత సీజన్‌లో గాయం కారణంగా ఆడలేదు. ప్రస్తుత ట్రేడింగ్ విండోలో ఇది మూడో పెద్ద డీల్. ఇప్పటికే లక్నో నుంచి రిషభ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్



వైభవ్ సూర్యవంశీకి వైస్ కెప్టెన్సీ వద్దు

ఐపీఎల్‌లో తన విధ్వంసక బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కీలక సూచన చేశారు. ఇంత చిన్న వయసులోనే నాయకత్వ బాధ్యతలు అప్పగించడం తొందరపాటేనని అభిప్రాయపడ్డారు. ముందుగా రెడ్ బాల్ క్రికెట్‌లో మరిన్ని మ్యాచ్‌లు ఆడి అనుభవం సంపాదించాలని సూచించారు. ఒక్కో అడుగు ముందుకేస్తూ ఎదగాలని హితవు పలికారు. రెడ్డిట్‌లో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఓ అభిమాని వైభవ్‌కు 15 ఏళ్ల వయసులోనే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంపై సచిన్ అభిప్రాయం అడిగారు. దీనికి స్పందించిన మాస్టర్ బ్లాస్టర్.. దులీప్ ట్రోఫీలో వైస్ కెప్టెన్‌గా నియమించడం కూడా తొందరపాటేనని అన్నారు. మరిన్ని రెడ్‌బాల్ మ్యాచ్‌లు ఆడేందుకు అవకాశం ఇవ్వాలని, ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎదిగేలా చూడాలని పేర్కొన్నారు. 2026 దులీప్ ట్రోఫీలో ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్ జట్టుకు వైభవ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అప్పటికి అతడు బిహార్ తరఫున కొన్ని ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అయినా మహమ్మద్ షమీ, అభిమన్యు ఈశ్వరన్, ముఖేశ్ కుమార్ వంటి అనుభవజ్ఞుల కంటే ముందే నాయకత్వ బాధ్యతలు దక్కడం చర్చనీయాంశమైంది. సెమీఫైనల్‌లో ఇషాన్ కిషన్ వేలికి గాయమవడంతో వైభవ్ జట్టు పగ్గాలు చేపట్టాడు. ఆ టోర్నీలో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది.



43 పరుగుల ఇన్నింగ్సే బెస్ట్: కోహ్లీ

వన్డే క్రికెట్‌లో విరాట్ కోహ్లీ సాధించిన సెంచరీలు ఎన్నో. 183, 133 నాటౌట్ వంటి అద్భుత ఇన్నింగ్స్‌లు అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. అయితే తన కెరీర్‌లో అత్యుత్తమ వన్డే ఇన్నింగ్స్ ఏదంటే మాత్రం కోహ్లీ అనూహ్యమైన సమాధానం చెప్పాడు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై చేసిన 43 పరుగుల ఇన్నింగ్సే తనకు అత్యంత ప్రత్యేకమని వెల్లడించాడు. ఈరోజు 38వ పుట్టినరోజు జరుపుకొంటున్న కోహ్లీ.. ఈ సందర్భంగా స్టార్ స్పోర్ట్స్ రూపొందించిన ప్రత్యేక వీడియోలో పాల్గొన్నాడు. తన కెరీర్‌లోని కొన్ని కీలక ఇన్నింగ్స్‌లను జతచేసి, వాటిలో ఏది అత్యుత్తమమో ఎంచుకోవాలని నిర్వాహకులు కోరారు. తొలుత 2011 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో శ్రీలంకపై చేసిన 35 పరుగుల ఇన్నింగ్స్‌ను ఎంపిక చేశాడు. హోబర్ట్‌లో శ్రీలంకపై 2012లో చేసిన అజేయ 133 పరుగులు, 2023 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై చేసిన 85 పరుగుల కంటే దానికే ప్రాధాన్యమిచ్చాడు. ఇంగ్లండ్‌పై 2017లో చేసిన 122, దక్షిణాఫ్రికాపై 2018లో సాధించిన అజేయ 160 పరుగుల ఇన్నింగ్స్‌లనూ పక్కనపెట్టాడు.

ఈవార్తలు సంపాదకీయం Editorial

బాలీవుడ్ జాగ్రత్తగా ఉండాలి

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. ఇక్కడ భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న సంప్రదాయాలు కలిసి జీవిస్తున్నాయి. ప్రతి పండుగకు ఒక చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక ప్రాధాన్యం, కోట్లాది ప్రజల విశ్వాసం ముడిపడి ఉంటాయి. అలాంటి పండుగలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా కోట్లాది మంది ప్రేక్షకుల ఆదరణతో ఎదిగిన సినీ పరిశ్రమకు ఈ బాధ్యత మరింత ఎక్కువ. కానీ బాలీవుడ్‌లో తరచూ చోటుచేసుకుంటున్న కొన్ని ప్రకటనలు, ప్రచార చిత్రాలు, సృజనాత్మక ప్రయోగాలు ఈ బాధ్యతను గుర్తుచేస్తున్నాయి. తాజాగా నటి దియా మీర్జా నటించిన ప్రకటన చుట్టూ చెలరేగిన వివాదం కూడా ఇదే చర్చకు తెరతీసింది. ప్రకటనల రూపకల్పనలో కొత్తదనం ఉండాలి. సామాజిక సందేశం ఉండాలి. పాత ఆలోచనలను ప్రశ్నించే స్వేచ్ఛ కూడా ఉండాలి. అయితే ఆ స్వేచ్ఛకు ఇతరుల విశ్వాసాలను గాయపరిచే హక్కు మాత్రం ఉండదు. ఒక పండుగ వెనుక ఉన్న ఆచారాన్ని, సంప్రదాయాన్ని, ఆధ్యాత్మిక భావనను అర్థం చేసుకోకుండా వ్యాపార ప్రయోజనాల కోసం వక్రీకరించడం ఎంతవరకు సమంజసం? ప్రేక్షకుల ఆదరణ పొందాలనే ఉద్దేశంతో వివాదాస్పద అంశాలను ఎంచుకోవడం సృజనాత్మకత అనిపించుకోదు. ముఖ్యంగా హిందూ పండుగలు, సంప్రదాయాల విషయంలోనే ఇలాంటి వివాదాలు పదేపదే ఎందుకు తలెత్తుతున్నాయన్న ప్రశ్నకు బాలీవుడ్ సమాధానం చెప్పుకోవాల్సి ఉంది. ఈ వివాదంలో మరో కోణాన్ని కూడా విస్మరించకూడదు. దియా మీర్జా ప్రకటనలో దీపావళి పండుగను కించపరిచే సందేశం ఉందని చెప్పడానికి ఆధారాలు లేవు. ముంబై మహానగర పాలక సంస్థ చేపట్టిన పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆమె బాణసంచా వల్ల కలిగే వాయు, శబ్ద కాలుష్యంపై సందేశం ఇచ్చారు. అయితే కొందరు రాజకీయ నాయకుల అభ్యంతరాల నేపథ్యంలో ఆమె వీడియోను తొలగించడం, ఆ తర్వాత బాంబే హైకోర్టు జోక్యం చేసుకుని తిరిగి ప్రచురించాలని సూచించడం ఈ వివాదంలో కీలక పరిణామాలు. పర్యావరణ పరిరక్షణ అంశాన్ని మతపరమైన వివాదంగా మార్చడం సరికాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే ఈ ఒక్క ఉదంతంతోనే బాలీవుడ్‌పై తీర్పు చెప్పలేం. కానీ గతంలోనూ హిందూ పండుగలు, ఆచారాలు, సంప్రదాయాలను ఇతివృత్తంగా చేసుకున్న కొన్ని ప్రకటనలు, సినిమాలు వివాదాలకు కారణమయ్యాయి. సృజనాత్మకత పేరుతో హిందూ సంప్రదాయాలను అపహాస్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. అదే సమయంలో ఇతర మతాల పండుగలు, సంప్రదాయాల విషయంలోనూ ఇదే స్థాయిలో ప్రశ్నించే ధైర్యం, సమానమైన వైఖరి కనిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఏ మతం విషయంలోనైనా ఒకే ప్రమాణం ఉండాలి. ఒకరి విశ్వాసాలను గౌరవిస్తూ మరొకరి విశ్వాసాలను తేలిగ్గా తీసుకోవడం ద్వంద్వ వైఖరిగానే భావించాల్సి వస్తుంది.

‘అమెరికా మాత్రమే’.. ఆ దేశానికే ముప్పు!

అమెరికా ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశంగా ఎదగడంలో అక్కడి శాస్త్ర, సాంకేతిక ప్రగతితోపాటు ప్రపంచ దేశాల నుంచి వచ్చిన వలస ప్రజల పాత్ర కూడా ఎంతో ఉంది. భిన్న జాతులు, భాషలు, సంస్కృతులు, మతాలు, ఆలోచనా విధానాలకు నిలయంగా నిలిచిన అమెరికా ప్రత్యేకతే దాని బహుళత్వం. అలాంటి దేశంలో ‘అమెరికా ఫస్ట్’ అనే నినాదాన్ని సంకుచిత జాతీయవాదానికి పర్యాయపదంగా మార్చే ప్రయత్నాలు అనేక ప్రశ్నలకు తావిస్తున్నాయి. దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం వేరు.. ప్రపంచం నుంచి వచ్చిన ప్రజల భాగస్వామ్యాన్ని తక్కువగా చూడటం వేరు. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను గుర్తించాల్సిన అవసరం ఉంది. అమెరికా అంటే కేవలం అమెరికన్లు మాత్రమే కాదు. ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రాంతాల ప్రజలకు ఆ దేశంలో ఏదో ఒక రూపంలో భాగస్వామ్యం ఉంది.



భారతీయులు, చైనీయులు, మెక్సికన్లు, యూరోపియన్లు, ఆఫ్రికన్లు.. ఇలా ఎన్నో దేశాల నుంచి వచ్చిన ప్రజలు అమెరికా సమాజంలో భాగమయ్యారు. అక్కడి విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ఆసుపత్రులు, సాంకేతిక రంగం, వ్యాపార సంస్థల్లో విదేశీయుల పాత్ర గణనీయంగా ఉంది. అమెరికా బలం దాని సైనిక శక్తిలోనే కాదు.. ప్రపంచం నలుమూలల నుంచి ప్రతిభను ఆకర్షించగల సామర్థ్యంలోనూ ఉంది. అలాంటి దేశానికి నాయకత్వం వహిస్తున్న డొనాల్డ్ ట్రంప్ ‘అమెరికా ఫస్ట్’ నినాదాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నారన్నది ఇప్పుడు అంతర్జాతీయ చర్చకు కారణమవుతోంది. అమెరికా జనాభా గణాంకాలే ఆ దేశ బహుళత్వాన్ని చాటుతున్నాయి. 2024 నాటి అమెరికా జనాభా లెక్కల ప్రకారం అక్కడ 5.02 కోట్ల మంది విదేశాల్లో జన్మించినవారు నివసిస్తున్నారు. ఇది మొత్తం జనాభాలో 14.8 శాతం. అంటే ప్రతి ఏడుగురిలో ఒకరు విదేశాల్లో పుట్టి అమెరికాలో స్థిరపడినవారే. వీరిలో చాలామంది అమెరికా పౌరసత్వం పొందినవారు కాగా, మరికొందరు శాశ్వత నివాసులు, విద్యార్థులు, తాత్కాలిక ఉద్యోగులు. వీరి శ్రమ, నైపుణ్యం, ఆలోచనలు అమెరికా అభివృద్ధిలో భాగమయ్యాయి. అందుకే అమెరికాను ఒక దేశంగా మాత్రమే కాకుండా ప్రపంచంలోని భిన్న సంస్కృతుల సమ్మేళనంగా చూడాల్సి ఉంటుంది.

ట్రంప్ ప్రభుత్వం మాత్రం వలస విధానాలపై కఠిన వైఖరిని అనుసరిస్తోంది. అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలన్నది, దేశ భద్రతకు ముప్పు కలిగించే అక్రమ వలసలను అడ్డుకోవాలన్నది ఆయన ప్రభుత్వ విధానాల వెనుక ఉన్న ప్రధాన వాదన. ఈ లక్ష్యాలకు సంబంధించి ప్రభుత్వానికి తన వాదనలు ఉండవచ్చు. అయితే చట్టబద్ధంగా అమెరికాలో నివసిస్తున్న విదేశీయులు, విద్యార్థులు, నిపుణులపైనా కఠిన ఆంక్షలు విధించడం వల్ల ఎదురయ్యే పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. హెచ్-1బీ ఉద్యోగ వీసాలపై లక్ష డాలర్ల చెల్లింపు నిబంధన, విదేశీ విద్యార్థుల బస వ్యవధిపై పరిమితులు ఇందుకు ఉదాహరణలు. ఇక్కడే ట్రంప్ విధానాలపై అసలు చర్చ మొదలవుతోంది. అమెరికా ప్రయోజనాలను కాపాడటం అంటే ప్రపంచ దేశాల నుంచి వచ్చే ప్రతిభకు తలుపులు మూసేయడమేనా? స్వదేశీ ఉద్యోగులకు అవకాశాలు కల్పించడం అంటే విదేశీ నిపుణుల సేవలను నిరాకరించడమేనా? అక్రమ వలసలను నియంత్రించడం అంటే చట్టబద్ధంగా వచ్చినవారిని కూడా అనుమానంతో చూడటమేనా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకకుండా కేవలం జాతీయవాద నినాదాలతో ముందుకెళ్తే అమెరికా ఆర్థిక వ్యవస్థకే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రపంచీకరణ కాలంలో ఏ ఒక్క దేశమూ ఒంటరిగా అభివృద్ధి చెందలేదన్నది వాస్తవం. అమెరికా సాంకేతిక రంగంలో సాధించిన ప్రగతికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకుల సహకారం ఉంది. భారతీయ సంతతికి చెందిన నిపుణులు అమెరికా సాంకేతిక, వైద్య, వ్యాపార రంగాల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన విద్యార్థులు అక్కడి విశ్వవిద్యాలయాలకు విజ్ఞానంతోపాటు ఆర్థిక వనరులనూ అందిస్తున్నారు. ఈ అంతర్జాతీయ భాగస్వామ్యమే అమెరికాను ప్రపంచ ప్రతిభకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపింది. అలాంటి ఆకర్షణ తగ్గితే ఆ అవకాశాన్ని ఇతర దేశాలు అందిపుచ్చుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

అగ్రరాజ్యానికి ప్రపంచమంతటితో సంబంధాలు అవసరం. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు, విద్య, రక్షణ.. ఇలా ప్రతి రంగంలో అంతర్జాతీయ సహకారం కీలకం. అమెరికా తన ప్రయోజనాలను కాపాడుకుంటూనే ఇతర దేశాల ప్రయోజనాలను గౌరవించాలి. ఇతర దేశాల ప్రజలతో సంబంధాలను అనుమానంతో చూడకుండా, పరస్పర గౌరవంతో ముందుకు సాగాలి. అమెరికా ఫస్ట్ అనే నినాదం అమెరికా ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలనే అర్థంలో ఉంటే దానికి అభ్యంతరం ఉండకపోవచ్చు. కానీ ప్రపంచంతో సంబంధాలను కుదించుకునే విధంగా, విదేశీయుల భాగస్వామ్యాన్ని తక్కువ చేసే విధంగా అమలైతే మాత్రం దాని పరిణామాలు ఆ దేశానికే పరిమితం కావు. అమెరికా గొప్పతనం ఇతర దేశాలను చిన్నచూపు చూడటంలో లేదు. ప్రపంచంలోని భిన్న జాతులు, సంస్కృతులు, ప్రతిభావంతులకు అవకాశాలు కల్పించడంలో ఉంది. ఆ దేశాన్ని నిర్మించడంలో వలసదారుల పాత్రను విస్మరించడం చరిత్రను విస్మరించడమే అవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తీసుకునే ప్రతి నిర్ణయం ప్రపంచ దేశాలపై ప్రభావం చూపుతుంది. అందువల్ల ఆయన విధానాల్లో జాతీయ ప్రయోజనాలతోపాటు అంతర్జాతీయ బాధ్యత కూడా ప్రతిబింబించాలి. దేశ సరిహద్దులను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో, ప్రపంచంతో సంబంధాలను కాపాడుకోవడమూ అంతే ముఖ్యం. అగ్రరాజ్యం తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రపంచాన్ని దూరం చేసుకోవడం కాకుండా ప్రపంచాన్ని కలుపుకుపోవాలి. ఎందుకంటే అమెరికా బలం ఒక్క అమెరికాలోనే లేదు.. ప్రపంచంతో దానికి ఉన్న అనుబంధంలోనూ ఉంది.

శ్రీకాంత్ చుక్కల, నిజామాబాద్



ఏపీలో ఎన్నికలు అపహాస్యం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అంటే కేవలం ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన మాత్రమే కాదు. ప్రతి పౌరుడికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించడం, ప్రతి అభ్యర్థికి పోటీ చేసే స్వేచ్ఛను కల్పించడం, అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ఎన్నికల వ్యవస్థ ప్రాథమిక బాధ్యత. ఈ బాధ్యతను నిర్వర్తించాల్సిన ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. మున్సిపల్ ఎన్నికల నుంచి మండల, జిల్లా పరిషత్ ఎన్నికల వరకు వివిధ దశల్లో చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య ఎన్నికల విశ్వసనీయతపై చర్చకు దారితీశాయి. ఎన్నికల్లో గెలుపోటములు సహజం. ప్రజలు ఎవరికి పట్టం కట్టాలనుకుంటే వారినే ఎన్నుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగా తీర్పు ఇవ్వవచ్చు. ప్రతిపక్షానికి మద్దతు పలకవచ్చు. కానీ ఓటరు తనకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసే పరిస్థితి ఉండాలి. అభ్యర్థి నామినేషన్ వేయడం దగ్గర నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎలాంటి ఒత్తిళ్లు, అడ్డంకులు, బెదిరింపులు లేకుండా ప్రక్రియ సాగాలి. ఈ ప్రాథమిక సూత్రాలపైనే ఏపీలో జరిగిన స్థానిక ఎన్నికలు అనుమానాలను మిగిల్చాయి. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దశ నుంచే వివాదాలు మొదలయ్యాయి. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. అభ్యర్థులకు రక్షణ కల్పించాలని, ఫిర్యాదులను పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో అక్టోబర్ 21న రాష్ట్ర ఎన్నికల సంఘం 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియను నిలిపివేసింది. ఆ తర్వాత సవరించిన షెడ్యూల్‌తో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఒక ఎన్నికల ప్రక్రియ సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే స్థాయికి చేరడం సాధారణ పరిణామం కాదు. ఎన్నికల సంఘం ముందుగానే అప్రమత్తమై ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదా అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. పోలింగ్ సమయంలోనూ వివాదాలు కొనసాగాయి. నవంబర్ 1న జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పలు ప్రాంతాల్లో ఘర్షణలు, బూత్‌ల ఆక్రమణ, ఓటర్లను ప్రభావితం చేయడం వంటి ఆరోపణలు వచ్చాయి. పులివెందులలో చోటుచేసుకున్న పరిణామాలు మరింత చర్చనీయాంశమయ్యాయి. ఎన్నికల సంఘం స్వయంగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ దెబ్బతిన్నట్లు గుర్తించి 13 పోలింగ్ కేంద్రాల్లో తిరిగి పోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది. పులివెందులలోని నాలుగు కేంద్రాల్లో బూత్‌ల ఆక్రమణ జరిగినట్లు పేర్కొంటూ అక్కడి పోలింగ్‌ను రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. అంటే ఎన్నికల అక్రమాలపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ విమర్శలేనని కొట్టిపారేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇక ఫలితాల విషయానికి వస్తే అధికార తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి పట్టణ స్థానిక సంస్థల్లో భారీ ఆధిక్యం సాధించింది. ఈ విజయాన్ని అధికార పక్షం ప్రజల మద్దతుగా అభివర్ణించింది. ప్రజల తీర్పును గౌరవించాల్సిందే. అయితే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోయామని, తమ ఏజెంట్లను అడ్డుకున్నారని, ఓట్ల లెక్కింపులోనూ అక్రమాలు జరిగాయని ప్రతిపక్షం చేసిన ఆరోపణలను కూడా విస్మరించలేం. వైఎస్సార్‌సీపీ ఈ అంశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసింది. అధికార కూటమి మాత్రం ప్రతిపక్ష ఆరోపణలను ఖండించింది. ఈ పరస్పర ఆరోపణల మధ్య నిజానిజాలను నిష్పాక్షికంగా తేల్చాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉంది. ఏకగ్రీవాల విషయంలోనూ సమగ్ర పరిశీలన అవసరం. పోటీలో ఎవరూ లేకుండా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే. అయితే నామినేషన్ల ఉపసంహరణ వెనుక ఒత్తిళ్లు ఉన్నాయా? అభ్యర్థులు స్వచ్ఛందంగానే పోటీ నుంచి తప్పుకున్నారా? బెదిరింపులు, ప్రలోభాలు పనిచేశాయా? అన్న అంశాలను పరిశీలించాలి. ఏకగ్రీవాల సంఖ్య ఎక్కువగా ఉందన్న కారణంతోనే అక్రమాలు జరిగాయని చెప్పలేం. అదే సమయంలో వాటి వెనుక ఉన్న పరిస్థితులను తెలుసుకోకుండా ప్రజాస్వామ్య విజయం అని ప్రకటించడమూ సమంజసం కాదు. ప్రజాస్వామ్యంలో గెలిచిన పార్టీకి అధికారం లభిస్తుంది. కానీ ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం లేకపోతే ఆ విజయానికి లభించాల్సిన ప్రజాస్వామ్య గౌరవం కూడా ప్రశ్నార్థకమవుతుంది. అందుకే ఏపీ ఎన్నికల సంఘం తన పనితీరుపై వచ్చిన విమర్శలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు.. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే అసలైన బాధ్యత. ఆ బాధ్యతలో ఎక్కడా రాజీకి తావుండకూడదు.

- ఎం కోటేశ్వరరావు, కర్నూలు, ఆంధ్రప్రదేశ్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.